# వినిమయ 3

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం










apmas

# సభ్యుల భాగస్వామ్యం




# 3

# వినిమయ

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో సభ్యత్వం

పాలకవర్గ సభ్యుల అవగాహన
కొరకు రూపొందించిన పుస్తకము


# వినిమయ

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో సభ్యత్వం

ప్రధమ ప్రచురణ – జులై 2019

వెల : రూ. 100

పున:ముద్రణ హక్కు ఏపిమాస్ కలిగి వున్నది. ఏపిమాస్ అంగీకారముతో, ఏపిమాస్ మరియు డి జి ఆర్ వి చిహ్నములతో ఈ పుస్తకమును ముద్రించుకొనవచ్చును.

ఈ పుస్తక ప్రతుల కొరకు ఏపిమాస్ ఫోన్ నంబర్‌కు ఫోన్ చెయ్యండి లేదా ఈ–మెయిల్ పంపండి.

### ప్రచురణ కర్త

apmas

మహిళా అభివృద్ధి సొసైటి (ఏపిమాస్)

ప్లాట్ నెం.11 & 12, హుడా కాలని, తానీషా నగర్,

మణికొండ, హైదరాబాదు-500089, తెలంగాణ, ఇండియా

ఫోన్ నెం. 08413-403118 / 403120

e-mail - info@apmas.org. Website - www.apmas.org

# తొలి పలుకులు

**భా**రతదేశంలో రైతులు ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నప్పటికి, గత దశాబ్ద కాలంలో వ్యవసాయ రంగంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తున్నది. రైతులను సంఘటితపరచి, రైతుల శ్రేయస్సుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్.పి.ఓలు) ఏర్పాటు చేయడం అనేది విధాన నిర్ణేతలకు, ప్రోత్సాహకులకు అత్యంత ఆమోదయోగ్యమైన సంస్థాగత ప్రక్రియగా రూపొందింది. భారతదేశంలో వచ్చే ఐదేళ్ళలో రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి అనుసరించవలసిన తిరుగులేని వ్యూహం ఎఫ్ పి ఓ! దేశంలో ఇప్పటికే వివిధ సంస్థల ద్వారా దాదాపు 5000 ఎఫ్ పి ఓలు ఏర్పాటయ్యాయి, ఇంకా ఎన్నో ఏర్పాటు కానున్నాయి. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో రైతులు దాదాపు 700 ఎఫ్ పి ఓలు ఏర్పాటు చేసుకున్నారు.

అయితే, ఎఫ్ పి ఓ ఉద్యమం ఇప్పటికీ ప్రారంభ దశను దాటలేదు. కారణం ఏమిటంటే, ఎఫ్ పి ఓల పాలకవర్గమునకు చాలా తక్కువ శిక్షణ అందటమే. ఫలితంగా వారు తమ ఎఫ్ పి ఓ ఆశయం (విజన్), వ్యాపార దృక్పథం, సామర్థ్యాల విషయంలో తమ ప్రోత్సాహక సంస్థలపైనే ఆధారపడవలసి వస్తున్నది. మంచి శిక్షణ పొంది, అంకిత భావంతో, దృఢంగా వ్యవహరించే కార్యనిర్వాహక అధికారులు లేని లోటు ఎఫ్.పి.ఓలలో కనిపిస్తున్నది. ఎఫ్ పి ఓలు ఇంకా సుపరిపాలన, వ్యాపార నిర్వహణ, సమర్థమైన వ్యవస్థలు, నిధుల అందుబాటు, మార్కెట్ సౌకర్యం, ప్రభుత్వ పథకాల వర్తింపు వంటి అనేక ఇతర సవాళ్ళను కూడా ఎదుర్కోవలసి వస్తున్నది. వ్యవసాయ విలువ గొలుసు మరింత మెరుగుపడేలా తగినంతగా ప్రభావితం చేయగల సామర్థ్యం ఎఫ్ పి ఓలకు ఇంకా సుదూరంగానే వున్నది.

ఎఫ్ పి ఓలు తమ సభ్యుల కోసం పని చెయ్యాలి. సభ్యులైలన రైతులకు అవసరమైన ముఖ్య సేవలను అందించి, వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, అంతేకాక ఎఫ్ పి ఓలు వ్యాపార సంస్థలుగా ఎదిగి విజయవంతంగా మనుగడ సాగించాలంటే, ఎఫ్ పి ఓల పాలకవర్గము వారి సంస్థలను సమర్థంగా నిర్వహించగలిగే శక్తి సామర్థ్యాలను కలిగి వుండటం చాలా ముఖ్యము. ఎఫ్ పి ఓల పాలకవర్గానికి, సిబ్బందికి, సభ్యులకు కూడా నిరంతరం శిక్షణ సమకూర్చడం, మార్గదర్శనం చేయడం ఏపిమాస్‌కు అత్యంత ప్రాధాన్యాంశం. ఏపిమాస్ తన ఇంక్యుబేషన్ సెంటరు ద్వారా అనేక ఎఫ్ పి ఓల ఏర్పాటును స్వయంగా ప్రోత్సహించడంతో పాటు, ఇతర ప్రోత్సాహక సంస్థలు ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓలు వ్యవసాయిక విలువ గొలుసు మెరుగుదలకు తగిన చర్యలు తీసుకునే విధంగా మార్గదర్శకత్వం వహిస్తున్నది.

స్వయం నియంత్రణ ఉద్యమములో భాగముగా స్వయం సహాయక సంఘాలకు మరియు సమాఖ్యలకు తమంతట తామే నేర్చుకొనుటకు కరదీపికలను ఏపిమాస్ రూపొందించింది. ఈ కరదీపికలు రూపొందించటములో,

శిక్షణలో అపారమైన అనుభవం కలిగిన శ్రీ మధుమూర్తి, శ్రీమతి రామలక్ష్మి నాయకత్వంలో ఏపిమాస్ బృందం, రిసోర్స్ సంస్థలు, భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలు, శిక్షణా సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధుల సహకారంతో ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యుల కోసం సులువుగా అవగాహన పొందగలిగే పుస్తక మాలికలను తయారుచేసింది. ఇవి : ఎఫ్ పి ఓ ఆవశ్యకత, ప్రాముఖ్యం, సంస్థాగత స్వరూపం మరియు రూపకల్పన, సభ్యత్వం, నాయకత్వం, పాలన, యాజమాన్యం, చట్టబద్ధత, వ్యాపార ప్రణాళిక, ఉత్పాదకత పెంపుదల, సామూహిక మార్కెటింగ్ (పెట్టుబడులు, ఉత్పత్తులు), వ్యవసాయ సేవల కేంద్రం నిర్వహణ, ఖాతాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ అనే అంశాలకు సంబంధించినవి.

ఎఫ్ పి ఓ అనేది శాశ్వతంగా కొనసాగే స్వయం నిర్ణయాధికారం గల ప్రజాస్వామ్య సంస్థ. ఎఫ్ పి ఓ పాలకవర్గమునకు, పదాధికారులకు నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు జరుగుతాయి, పాలకవర్గ సభ్యులు మారుతూ ఉంటారు. అందువల్ల ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యులకు సామర్థ్యాల పెంపుదల అవసరము ఎప్పుడూ ఉంటుంది. ఎఫ్ పి ఓలు సమర్థ నిర్వహణతో తమ సభ్యులకు సేవలు అందించడానికి ఈ పుస్తక మాలిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నదని మా గట్టి నమ్మకం. ఈ పుస్తక మాలిక ద్వారా ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యులు తమ అవగాహనను పెంపొందించుకునేలా ఎఫ్ పి ఓల ప్రోత్సాహక సంస్థలు వారికి తగిన తోడ్పాటు అందించాలి. ఎఫ్ పి ఓలు స్వయం నిర్వహణతో, సమర్థంగా పని చేసే వ్యాపార సంస్థలుగా ఎదిగే విధంగా వాటికి తగిన మార్గదర్శకత్వం వహించడం కోసం ఎఫ్ పి ఓల ప్రోత్సాహక సంస్థలు, ఇతర భాగస్వాములు కూడా ఈ పుస్తక మాలికను ఉపయోగించుకోవచ్చు. ఈ పుస్తక మాలికను తెలుగులో, ఆంగ్లంలో తీసుకువచ్చే బాధ్యతను ఏపిమాస్ చేపట్టింది. అవసరానికి అనుగుణంగా ఈ పుస్తక మాలికను ఇతర భారతీయ భాషలలోకి తగిన రీతిలో అనువదించే బాధ్యతను రిసోర్స్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డ్, శిక్షణా సంస్థలు వహించవలసి ఉంటుంది. అటువంటి ఏ ప్రయత్నానికైనా ఏపిమాస్ తప్పక తన తోడ్పాటును అందిస్తుంది. ప్రతిస్పందనల కోసం నిరీక్షిస్తుంటాము.

అభినందనలతో

**సి ఎస్ రెడ్డి**

వ్యవస్థాపకులు మరిము ముఖ్య కార్యనిర్వహణాధికారి

ఏపిమాస్

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| ఈ పుస్తకం గురించి | | .... | 6 |
| పదకోశం | | .... | 8 |
| పూర్వ పరీక్ష | | .... | 10 |
| 1. | ఎఫ్.పి.ఓలలో సభ్యుల ప్రాధాన్యత | ... | 11 |
| 2. | సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణ | ... | 17 |
| 3. | సభ్యత్వములో ముఖ్య అంశములు | ... | 27 |
| 4. | ఎఫ్.పి.ఓలో సభ్యత్వం – ఎవరు? ఎలా? | ... | 41 |
| 5. | మూలధనం సమకూర్చుట – సభ్యత్వమే యాజమాన్యం | .... | 43 |
| ముగింపు పరీక్ష | | ... | 53 |

# ఈ పుస్తకం గురించి

**పాలకవర్గ సభ్యుల అవగాహన పుస్తకముల మాలిక**

1. జాగృతి – రైతు ఉత్పత్తిదారుల సంస్థల పరిచయం మరియు ఆవశ్యకత
2. పరికల్పన – రైతు ఉత్పత్తిదారుల సంస్థల సంస్థాగత స్వరూపం మరియు రూపకల్పన
3. **వినిమయ - రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం**
4. ప్రేరణ – రైతు ఉత్పత్తిదారుల సంస్థలో పరిపాలన
5. సమర్ధన – రైతు ఉత్పత్తిదారుల సంస్థల నిర్వహణ
6. సుధర్మ – రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో చట్టపరమైన నిబంధనలు
7. వ్యాపార ప్రణాళిక
8. అకౌంటింగ్ మరియు ఆర్థిక వనరుల నిర్వహణ
9. పంట గొలుసు నిర్వహణ సరఫరా
10. మార్కెటింగ్
11. వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల సేవలు
12. నాయకత్వం

## ఈ పుస్తకము గురించి

ఎఫ్.పి.ఓ. పాలకవర్గ సభ్యులు నేర్చుకొనే విషయాంశములలో సభ్యత్వం మూడవది. ఎఫ్.పి.ఓలలో సభ్యులే యజమానులు, మరియు సభ్యులకు సేవలు అందించటమే ఎఫ్.పి.ఓ. ఏర్పాటు ఉద్దేశ్యం. అందువలన ఈ పుస్తకం అత్యంత ప్రాధాన్యం కలిగినది.

## ఈ పుస్తకం ఉద్దేశ్యము

ఎఫ్.పి.ఓ. పాలకవర్గ సభ్యులకు అవసరమైన అవగాహన మరియు సమాచారం అందించి, వారు తమ బాధ్యతలను సమర్ధవంతముగా నిర్వహిస్తూ, తమ ఎఫ్.పి.ఓ.లను సభ్యులకు ప్రయోజనములు అందించే పటిష్టమైన సంస్థలుగా తయారు చేయుట ఈ పుస్తకం ఉద్దేశ్యము.

## ఈ పుస్తకము ఎవరికొరకు ?

ఈ పుస్తకము ఎఫ్.పి.ఓ. నిర్వహణలో కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉన్న పాలక వర్గ సభ్యుల కొరకు రూపొందించటము జరిగినది.

apmas

## లక్ష్యాలు

ఈ పుస్తకము నుండి పాలకవర్గ సభ్యులు క్రింది అంశములపై అవగాహన పెంపొందించుకుంటారు.

- సభ్యుల, వారి యాజమాన్యం మరియు నియంత్రణల ప్రాముఖ్యత గురించి తెలుసుకుంటారు.
- ఎఫ్.పి.ఓ సభ్యత్వంలోని కీలక అంశములను గురించి తెలుసుకుంటారు.
- సభ్యత్వము మరియు సభ్యుల ఆర్థిక భాగస్వామ్యము ఆవశ్యకత గురించి తెలుసుకుంటారు.

## ఈ పుస్తకము స్వరూపం మరియు విషయములు

ఈ పుస్తకము సభ్యుల ప్రాధాన్యతతో ప్రారంభించి సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణ గురించి వివరించును. తరువాత సభ్యత్వం లోని కీలక అంశములను మరియు సభ్యుల నుండి మూలధన సేకరణ ఆవశ్యకత గురించి తెలియజేయును.

## ఏ విధముగా ఉపయోగించుకోవాలి

పాలకవర్గ సభ్యులు ఈ పుస్తకమును తమంత తాముగా ఉపయోగించుకొనవచ్చును. లేదా బయటి వ్యక్తుల సహకారముతో ఈ విషయాలను నేర్చుకొనవచ్చును. దీనితో బాటు ఈ పుస్తకమునకు సంబంధించిన పోస్టర్‌లను సంబంధిత స్థలములలో పాలక వర్గ సభ్యులు నేర్చుకొనడానికి ప్రదర్శించవచ్చును.

మీరు ఈ పుస్తకము ద్వారా చాలా విషయాలు నేర్చుకొని మీ ఎఫ్.పి.ఓ.ని ప్రభావవంతముగా మరియు సమర్ధవంతముగా నిర్వహించగలరని ఆశిస్తున్నాము.

# పదకోశం

| | |
|---|---|
| ఎఫ్.పి.ఓ | – తమ ఆర్థిక, సాంఘిక అవసరాలను తీర్చుకునే నిమిత్తం కొంతమంది రైతులు స్వచ్ఛందంగా కలిసి ఏర్పాటు చేసుకున్న స్వతంత్ర్య ప్రతిపత్తి, స్వయం నిర్ణయాధికారముతో నడిచే ప్రైవేటు వ్యాపార సంస్థ |
| వాటాధనము | – ఎఫ్.పి.ఓ వ్యాపార కార్యకలాపాలకు సభ్యుల పెట్టుబడి |
| బోర్డు సభ్యులు/ పాలకవర్గ సభ్యులు | – ఎఫ్.పి.ఓ కార్యక్రమములను నిరంతరము నడిపించడానికి మహాసభచే ఎన్నికచేయబడిన వారిని పాలకవర్గము అంటారు. పాలకవర్గమునకు ఎన్నికైన సభ్యులను పాలకవర్గ సభ్యులు అంటారు. |
| ఓటు | – ఏదైనా విషయంపై మన అభిప్రాయములను నిర్ణయమును తెలుపుట |
| బైలాలు/ఉపవిధులు/ నిబంధనావళి | – ఎఫ్.పి.ఓ ప్రారంభములో సభ్యులు తయారుచేసుకున్న షరతులు మరియు ఎఫ్.పి.ఓ రిజిస్టరు కాబడిన చట్టముననుసరించి, ఆయా సమయములందు మార్పు చేసిన ఎఫ్.పి.ఓ నిబంధనావళి అని అర్థము. |
| మహాసభ | – ఎఫ్.పి.ఓలోని సభ్యులు అందరిని కలిపి మహాసభ అంటారు. |
| చురుకైన సభ్యులు | – సభ్యత్వ కొనసాగింపుకు అవసరమైన కనీస నిబంధనలు అనుసరిస్తూ 100% అంకితభావముతో కొనసాగే సభ్యులు |
| సహకార సంఘం | – పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం, 1995 క్రింద రిజిస్టరు అయిన సహకార సంఘం |
| బోర్డు/ పాలకవర్గము | – ఎఫ్.పి.ఓ యొక్క డైరెక్టర్ల బోర్డు అని అర్థము. |
| ఉపకమిటీలు (సబ్‌కమిటీలు) | – ఎఫ్.పి.ఓ నిర్వాహణ లేక వ్యాపారమునకు సంబంధించిన నిర్వహణకు, పర్యవేక్షణకు పాలకవర్గము తమ నుండి ముగ్గురు లేక అంతకన్నా ఎక్కువ మందిని తాత్కాలికముగా ఉపకమిటీగా |

| | | |
|---|---|---|
| | | ఎన్నుకొనటము జరుగుతుంది. ఎఫ్.పి.ఓ చేపట్టిన కార్యక్రమములు, అవసరమును బట్టి ఆయా ఉపకమిటీలను ఎఫ్.పి.ఓ పాలకవర్గము ఏర్పాటు చేసుకోవటము జరుగుతుంది. |
| ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ (ఎ.ఓ.ఎ) | – | కంపెనీ ఉద్దేశ్యము కంపెనీ నిర్వహణకు సంబంధించిన నియంత్రణలను వివరించే పత్రాలు, సంస్థలో ఏ పనిని ఏ విధముగా పూర్తి చెయ్యాలి అన్నది వివరముగా ఈ పత్రాలలో వివరించి వుంటుంది. ఉదా : డైరెక్టర్లను ఏ విధముగా ఎంపిక/ నియామకము చెయ్యాలి, నిధులకు సంబంధించిన రికార్డులను ఏ విధముగా నిర్వహించాలి అన్నది కూడా ఈ పత్రాలలో వుంటుంది. |
| సభ్యత్వ రుసుము | – | ఒక వ్యక్తి ఎఫ్.పి.ఓలో సభ్యత్వము పొందుటకు, వాటాధనముతో పాటు చెల్లించే రుసుము. |
| యాజమాన్య హక్కు | – | ఎఫ్.పి.ఓలో సభ్యులు వాటాధనమును పెట్టినందువల్ల వారికి యాజమాన్యపు హక్కు లభిస్తుంది. |
| వ్యాపార నియమములు | – | ఎఫ్.పి.ఓ బైలాస్/ ఎ.ఓ.ఎలో ప్రతి విషయము పూర్తిగా అన్ని వివరములు వ్రాయబడి వుండవు. కనుక ఎఫ్.పి.ఓ వ్యాపార నిర్వహణకు సంబంధించిన నియమములను విపులముగా వ్రాయబడి వుంటాయి. అంటే బైలాస్ (ఎ.ఓ.ఎ) లోని అంశముల యొక్క ఆచరణ విధానమునే వ్యాపార నియమాలు అంటారు. |
| వ్యవహార బోనస్/డివిడెండ్ (పాట్రనేజ్ రిబేట్) | – | ఎఫ్.పి.ఓ సంపాదించిన మిగులులో కొంత భాగమును నిబంధనావళిని అనుసరించి సభ్యులు, ఎఫ్.పి.ఓతో చేసిన లావాదేవీల ప్రకారం పంచి పెడతారు. దీనినే వ్యవహార బోనస్ అంటారు. |
| అసాధారణ/ అత్యవసర మహాసభ/ సమావేశము | – | అత్యవసర విషయములు చర్చించుటకు పాలకవర్గం ఏర్పాటుచేసే మహాసభ సమావేశమే అసాధారణ/ అత్యవసర మహాసభ సమావేశము. |

# పూర్వ పరీక్ష

ముందు మాటలో తెలిపిన ప్రకారం ఈ పుస్తకము ఎఫ్.పిలలో సభ్యత్వము గురించి తెలియ జేస్తుంది. దిగువ దీని గురించి ఈ పుస్తకములో అంశములపై కొన్ని ప్రశ్నలు ఇవ్వబడినవి. వీటికి మనం సమాధానము ఇద్దాము.

ఈ ప్రశ్నల వలన మన ప్రస్తుత అవగాహన స్థాయిని తెలిసికొని, ఈ పుస్తకములోని అంశములపై మన అవగాహనను మరింతగా పెంపొందించుటకు తోడ్పడుతుంది.

1. మన ఎఫ్.పి.ఓకు యజమానులు ఎవరు?

 ......................................................................................................

 ......................................................................................................

 ......................................................................................................

2. ఎఫ్.పి.ఓలో ఎవరు సభ్యులు కావచ్చు?

 ......................................................................................................

 ......................................................................................................

 ......................................................................................................

3. ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల మధ్య వ్యవహార లావాదేవీలు ఏమిటి?

 ......................................................................................................

 ......................................................................................................

 ......................................................................................................

apmas

1

# ఎఫ్.పి.ఓలలో సభ్యుల ప్రాధాన్యత

## ఉద్దేశ్యం



**పాలకవర్గ సభ్యులు ఎఫ్.పి.ఓలో సభ్యుల ప్రాముఖ్యతను తెలుసుకుని, సభ్యుల కొరకు పని చేయుటకు తీర్మానించుకుంటారు.**

### విషయాంశాలు

1. ఎఫ్.పి.ఓలో సభ్యుల ప్రాముఖ్యత
2. ఎఫ్.పి.ఓతో సభ్యుల వ్యవహార లావాదేవీలు

## పరిచయం

మనం ఇంతకు ముందు పుస్తకములో ఎఫ్.పి.ఓ రూపకల్పన మరియు సంస్థాగత స్వరూపము గురించి తెలుసుకున్నాము. ఎఫ్.పి.ఓలో సభ్యులు, పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది అనే ముగ్గురు భాగస్వాములు ఉంటారని గమనించాము, అంతేకాక సభ్యులు ఎఫ్.పి.ఓకి పునాది అని, మన పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది, సభ్యుల సంక్షేమము కొరకు పని చేయాలని తెలిసికొన్నాము. అందువల్ల ఎఫ్.పి.ఓలో అతి ముఖ్య భాగస్వాములైన సభ్యుల గురించి మనము ఈ పుస్తకములో తెలుసుకుంటాము.

ఈ పుస్తకములో సభ్యుల ప్రాముఖ్యత, వారి యాజమాన్యం మరియు నియంత్రణ గురించి వివరించటము జరిగినది. ఎఫ్.పి.ఓలో సభ్యత్వము ఒక కీలక అంశము. ఇందులో సభ్యత్వ సమీకరణ, సభ్యుల ప్రయోజనములను దృష్టిలో పెట్టుకుని సభ్యుల స్థాయిలో మరియు ఎఫ్.పి.ఓ. స్థాయిలో సమన్వయము చేయుట మరియు సభ్యులతో సంబంధముల గురించి తెలుసుకుంటాము. ఇవే కాకుండా ఎఫ్.పి.ఓ.లో సభ్యుల ఆర్థిక భాగస్వామ్యం ఆవశ్యకత గురించి కూడా తెలుసుకుంటాము.

## 1.1 ఎఫ్.పి.ఓలో సభ్యత్వం

ఎఫ్.పి.ఓ. వ్యాపారములోకి మనం వెళ్లేముందు, మనం ఎటువంటి కార్యక్రమాలు చేస్తాము. ఎఫ్.పి.ఓ. ఎవరి కొరకు పని చేస్తుంది అని అర్థం చేసుకోవలసి ఉంది.

మన ఎఫ్.పి.ఓ. వ్యాపారము దిగువ అంశములపై ఆధారపడి ఉండును.

- ❖ ఎవరు వ్యాపారమునకు యజమానులు?
- ❖ ఎవరు వ్యాపారమును నియంత్రించేవారు?
- ❖ ఎవరు వ్యాపారమును వినియోగించుకుంటారు?
- ❖ ఎవరు లాభములను పొందుతారు?


| సభ్యులు |
|---|
| ❁ ఎఫ్.పి.ఓ. యజమానులు |
| ❁ ఎఫ్.పి.ఓ. సేవలను వినియోగించుకొనేవారు |
| ❁ ఎఫ్.పి.ఓ.ను నియంత్రించేవారు |
| ❁ ఎఫ్.పి.ఓ. ఉనికికి కారణం |

ఏదైనా వ్యాపారము ఒక వ్యక్తికి చెందినది అయితే దానికి ఆ వ్యక్తే యజమాని, ఆ వ్యక్తే నియంత్రిస్తారు, ఆ వ్యక్తే నిర్వహిస్తారు. వ్యాపార ప్రయోజనములు/ లాభములు ఆ వ్యక్తే పొందుతాడు. ఇద్దరు అంతకంటే ఎక్కువ ఉండే భాగస్వామ్య వ్యాపారములో, వారే యజమానులు, వారే నడిపిస్తారు, వారే నియంత్రిస్తారు. వారు చేసే వ్యాపారమునకు చట్టపరమైన గుర్తింపు కలిగి లాభము మరియు నష్టమును, వారి పెట్టుబడి ఆధారముగా పంచుకొంటారు. మన ఎఫ్.పి.ఓ. కూడా ఒక రకమైన భాగస్వామ్య వ్యాపారం వంటిదే.


- ❖ మన ఎఫ్.పి.ఓలో చాలా మంది యజమానులు ఉంటాము.
- ❖ సభ్యులకు అవసరమైన రకరకాల సేవలను అందిస్తాము.
- ❖ మన సభ్యులే పెట్టుబడిదారులు ముఖ్యముగా సభ్యులే యజమానులు మరియు ఎఫ్.పి.ఓ. అందిస్తున్న సేవలను కూడా సభ్యులే వినియోగించుకొంటారు.
- ❖ సభ్యులే పరిపాలిస్తారు.

అంటే దాని అర్థం సభ్యులు ఎఫ్.పి.ఓ.కి పునాది, ఎఫ్.పి.ఓ ఉనికికి కారణము. ఎఫ్.పి.ఓ తమ సభ్యుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కొరకు పని చేసే సంస్థ.

**ఎఫ్.పి.ఓ మాదే, యజమానులము మేమే, సేవలు మావే. నియంత్రణ మాదే లాభ/ నష్టాలు మావే**






## ఎవరు సభ్యులు?


ఎఫ్.పి.ఓ. సేవలు ఉపయోగించుకోగల మరియు సభ్యత్వ బాధ్యతలను స్వీకరించుటకు సంసిద్ధులైన రైతులు సభ్యత్వము పొందవచ్చు. సభ్యత్వము పొందకోరేవారు ఎఫ్.పి.ఓ నిబంధనావళిని అనుసరించి సభ్యత్వ రుసుము, వాటాధనము చెల్లించి సభ్యత్వము పొందవలెను.

అయితే రెండు మూడు స్థాయిలలో ఏర్పాటు కాబడిన సంస్థలలో రెండవస్థాయి నుండి సభ్య సంఘాలు సభ్యత్వము పొందుతాయి. అదేవిధముగా సమాఖ్యలలో సభ్యత్వ ప్రాతిపదికగా, సభ్యులు తమ నుండి ప్రతినిధులను ఎన్నుకొని సమాఖ్యకు పంపటము జరుగుతుంది. ఈ విధముగా ఎన్నుకున్న వారికి, సభ్యులు సమాఖ్య పరిపాలన మరియు నిర్వాహణ అధికారములను, హక్కులను ఇవ్వటము జరుగుతుంది. వీరి ద్వారా సభ్యులు సమాఖ్య పాలనను, నియంత్రణను ఆచరిస్తారు. అయితే అంతిమ నిర్ణయాధికారము సభ్యులదే వుంటుంది.

## ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల మధ్య వ్యవహార లావాదేవీలు

ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల మధ్య సంబంధములు, వ్యవహారము లావాదేవీలు దిగువ చూపడం జరిగినది.

**చిత్రం 1 : ఎఫ్.పి.ఓ మరియు సభ్యుల మధ్య వ్యవహార లావాదేవీలు**



పైన చిత్రంలో చూపిన విధముగా సభ్యులు వాటాధనమును చెల్లించి ఎఫ్.పి.ఓకు యజమానులు అవుతారు. అంతేకాక ఎఫ్.పి.ఓ. అందించే సేవలు ఉపయోగించుకుంటారు. అదేవిధముగా తమ నుండి ప్రతినిధులను ఎంపిక చేయటము జరుగుతుంది. ఈ ప్రతినిధులు సభ్యులకు జవాబుదారీగా సభ్యుల నియంత్రణలో పని చేస్తారు. సభ్యులకు అవసరమైన సేవలను సకాలములో అందించుటే ఎఫ్.పి.ఓ. ఉద్దేశ్యము.

## ఎఫ్.పి.ఓల లాభసాటి వ్యాపారమునకు సభ్యుల ప్రాముఖ్యత

ప్రయాణికులు లేకుండా ఏదైనా ఆటో వ్యాపారం నడుస్తుందా?

వినియోగదారులు లేకుండా ఏదైనా కూరగాయల దుకాణం నడుస్తుందా?

ఈ రెండు సందర్భములలో స్పష్టమైన సమాధానం “కాదు” అనే.

అదేవిధముగా ఎఫ్.పి.ఓ. వ్యాపారం కూడా సభ్యులు లేకుండా నడవదు, ఎందుకంటే సభ్యులే ఎఫ్.పి.ఓ.కు వినియోగదారులు. ఉదాహరణకు రాబోయే వ్యవసాయ సీజన్‌కు సభ్యులకు 10 క్వింటాళ్ళ విత్తనములు అవసరమని సభ్య సంఘముల సహకారముతో ఒక ఎఫ్.పి.ఓ. అంచనా వేసినది. ఎఫ్.పి.ఓ ఋణము తీసుకొని 10 క్వింటాళ్ళ విత్తనము సభ్య సంఘముల ద్వారా సభ్యులకు సరఫరా చేయడానికి కొన్నది.

ఒకవేళ సభ్యులు కేవలం 2 క్వింటాళ్ళ విత్తనం మాత్రమే తీసుకుంటే ఏమి జరుగుతుంది?

కనుక వినియోగదారులు లేకుండా వ్యాపారం నిలువలేదు, అంటే సభ్యులు వినియోగించుకొనకుంటే ఎఫ్.పి.ఓకు వ్యాపారం మరియు సుస్థిరత లేదు.

ఇంకొక ఉదాహరణ దిగువన ఇవ్వబడినది.

సాధికారత ఎఫ్.పి.ఓ. కర్ణాటక రాష్ట్రములోని శివపురం బ్లాక్‌లో నడపబడుచున్నది. శివపురం బ్లాక్‌లో కందులు ప్రధాన పంట. సాధికారత ఎఫ్.పి.ఓ. కందిపప్పు మిల్లును ఏర్పాటు చేయాలని ఆలోచన చేసినది. మిల్లుకు కావలసిన సామర్థ్యం మరియు వ్యాపారమునకు అవసరమైన సభ్యులు దిగువ ఇవ్వడం జరిగినది.

| వివరములు | యూనిట్ | యూనిట్ల సంఖ్య |
|---|---|---|
| **ప్లాంట్** | | |
| 1 సంవత్సరమునకు మిల్లు సామర్థ్యం | క్వింటాళ్ళు | 9000 |
| **ముడి సరుకు వివరములు** | | |
| 2. ఒక సభ్యునికి సగటున భూమి విస్తీర్ణం | ఎకరములు | 2 |
| 3. సగటు ఉత్పాదకత | క్వింటాల్/ ఎకరానికి | 4 |
| 4. సభ్యునికి మొత్తం ఉత్పత్తి | క్వింటాల్ (2 ఎకరాలలో) | 8 |
| 5. ఎఫ్.పి.ఓ.కు సభ్యులు సరఫరా చేసే ఉత్పత్తి శాతం | % | 75% |
| 6. సభ్యులు సరఫరా చేసే ముడిసరుకు సగటు పరిమాణం | క్వింటాల్ | 6 |
| 7. మిల్లు సామర్థ్యమును వినియోగించుకొనుటకు కావలసిన ముడిసరుకును అందించవలసిన సభ్యులు | సంఖ్య | 1500 (9000÷6) |

పైన పేర్కొన్న ఉదాహరణ ప్రకారం ఎఫ్.పి.ఓ. పప్పు మిల్లును లాభసాటిగా నడవాలంటే 1500 మంది సభ్యులు అవసరం అన్నమాట.

ఇప్పుడు మనము సాధికారత ఎఫ్.పి.ఓ. లాభసాటి వ్యాపారము కొరకు దిగువ ప్రశ్నలపై ఆలోచించవలెను.

ఎఫ్.పి.ఓకు 1500 మంది సభ్యులు కాక కేవలం కొంతమంది సభ్యులు మాత్రమే ముడి సరుకు సరఫరా చేసినచో ఫలితం ఏవిధముగా ఉంటుంది?

పప్పు మిల్లు ఏర్పాటు చేసిన కొన్ని సంవత్సరముల తరువాత 1500 మంది సభ్యుల నుండి ముడి సరుకు సేకరించినచో ఫలితం ఏ విధముగా ఉంటుంది?

పైన పేర్కొన్న ఉదాహరణ ప్రకారము మనకు అర్థము అయినది ఏమంటే ఎఫ్.పి.ఓ. వ్యాపారం కొనసాగాలంటే తగినంత సభ్యులు మరియు వారి భాగస్వామ్యం చాలా ముఖ్యము. కాబట్టి మిల్లు పూర్తి సామర్థ్యమును వినియోగించుకొనుటకు ఎఫ్.పి.ఓ. వ్యాపారం లాభసాటిగా నడవడానికి తగిన సభ్యులను సమీకరించటము ఎఫ్.పి.ఓకి ఎంతో అవసరం.

2

# సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణ

## ఉద్దేశ్యం



**పాలక వర్గ సభ్యులు ఎఫ్.పి.ఓ.లో సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణపై అవగాహన పొందుతారు. సభ్యుల బాధ్యతల గురించి తెలిసికొంటారు.**


### విషయాంశాలు

1. సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణ
2. సభ్యుల బాధ్యతలు

ఇప్పటివరకు ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల నిర్వచనం ఆధారముగా తెలుస్తున్నది ఏమంటే ఎఫ్.పి.ఓలు సభ్యుల యాజమాన్యం మరియు నియంత్రణతో పని చేసే సభ్యత్వ సంస్థలు. ఇప్పుడు మనం ఎఫ్.పి.ఓలను సభ్యులు ఏవిధముగా యాజమాన్యం వహిస్తారు మరియు నియంత్రిస్తారో చూద్దాము.

**దిగువ మార్గముల ద్వారా సభ్యులు తమ ఎఫ్.పి.ఓలో యాజమాన్యం మరియు నియంత్రణ కలిగి ఉంటారు.**

**సభ్యులు యాజమాన్య హక్కు వినియోగం**



**వాటా ధనమును చెల్లించుట ద్వారా**



**ఎఫ్.పి.ఓ. మూలధనమునకు నిధులు చెల్లించుట ద్వారా**



**ఎఫ్.పి.ఓ. సేవలు ఉపయోగించుకొనుట ద్వారా**

**సభ్యులు నియంత్రణ హక్కును వినియోగం**



**పాలకవర్గ సభ్యులను ఎన్నుకొనుట ద్వారా**



**సమావేశంలో ఓటు వేయుట ద్వారా**



**ప్రధాన విషయములపై నిర్ణయం చేయుట ద్వారా**

మన ఎఫ్.పి.ఓ సభ్య సంఘాల ప్రతినిధుల ద్వారా ఎఫ్.పి.ఓ కార్యక్రమాల అమలును ప్రగతిని ఎప్పటికప్పుడు అందించాలి. ఈ నివేదికను రైతు సంఘములో చర్చించటం జరుగుతుంది. అదేవిధముగా సభ్య సంఘాల పనితీరును, ప్రగతిని పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టటము జరుగుతుంది. అంతేకాక కార్యాలయము వేళలో ఎఫ్.పి.ఓ పుస్తకములను, సభ్యులకు పరిశీలనకు అందుబాటులో వుంచుతుంది. సభ్యులు ఎఫ్.పి.ఓ నిర్ణయించిన రుసుము చెల్లించి సమాచారము పొందవచ్చు. అదేవిధముగా ఎఫ్.పి.ఓలో సంవత్సరము మధ్య కాలంలో అత్యవసర నిర్ణయాలు

చేయవలసి వస్తుంది. అందుకు రైతు సంఘములలో చర్చించి, సభ్యుల సలహాలను, అంగీకారమును తెలుసుకొని, పాలకవర్గము తగిన నిర్ణయము తీసుకుంటుంది.

## అభ్యాసం 1

దిగువ ఇవ్వబడిన రెండు ఎఫ్.పి.ఓ.లను పరిశీలించి ఆయా సంస్థలు విజయవంతముగా ఎలా పని చేస్తున్నాయో చర్చిద్దాము.

**ఎఫ్.పి.ఓ.1** ఈ ఎఫ్.పి.ఓ. పరిధిలోని అర్హతగల రైతులందరూ మొత్తం వాటాధనమును చెల్లించి సభ్యత్వం పొందినారు, (నిబంధనావళిలో పేర్కొనబడి రిజిస్ట్రార్‌చే ఆమోదించబడిన నిబంధన ప్రకారం) సభ్యులు ఎఫ్.పి.ఓ.లో ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపులు చేయుచున్నారు. ఉత్పత్తి కొనుగోలు సమయములో ఎఫ్.పి.ఓ సభ్యులకు చెల్లించవలసిన ధరలో 10 శాతం ధర మినహాయించి వ్యాపార కాలము పూర్తి అయిన తరువాత, వ్యాపారములో అయిన ఖర్చులను మినహాయించుకొని సభ్యులకు తిరిగి చెల్లిస్తుంది.

**ఎఫ్.పి.ఓ. 2** ఈ ఎఫ్.పి.ఓలో కొంతమంది రైతులు మాత్రమే సభ్యులుగా చేరారు మరియు కొంతభాగం మాత్రమే వాటాధనం చెల్లించారు. ఎఫ్.పి.ఓ.లో సభ్యులు పొదుపులు చేయుటము కానీ, ధరలో కొంత భాగం నిలిపి ఉంచే అలవాటు కానీ ఎఫ్.పి.ఓ.కు లేదు.

దిగువ ఇవ్వబడిన స్థలములో రెండు ఎఫ్.పి.ఓ.లలో యాజమాన్యం మరియు సభ్యుల నియంత్రణ ఎంతవరకు పాటించబడుతుందో ఆలోచించి వ్రాయగలము.

| **ఎఫ్.పి.ఓ 1** | **ఎఫ్.పి.ఓ 2** |
|---|---|
| | |

పై ఎఫ్.పి.ఓ. 1 నందు అర్హతగల సభ్యులు అందరూ పూర్తి వాటాధనము చెల్లించారు. అంతేకాక పొదుపులు కూడా చెయ్యటము వలన ఎఫ్.పి.ఓలో సభ్యుల సొంత నిధి ఎక్కువ ఉంటుంది. ఫలితముగా ఈ ఎఫ్.పి.ఓలో సభ్యుల యాజమాన్యము మరియు నియంత్రణ ఎక్కువగా వుంటుంది. అదే ఎఫ్.పి.ఓ 2లో సభ్యుల సొంత నిధులు లేకపోవటము వలన సభ్యులకు ఎఫ్.పి.ఓ. సేవలను అందించే ఒక సంస్థ అనే భావన తప్ప, ఎఫ్.పి.ఓ పై ఏ విధమైన యాజమాన్యము మరియు నియంత్రణ వుండదు. పై రెండు సందర్భాల నుండి మనము గమనించినది ఏమంటే ఎప్పుడు అయితే ఎఫ్.పి.ఓలో సభ్యుల ఆర్థిక భాగస్వామ్యము ఎక్కువగా వుంటుందో, అప్పుడే ఆ ఎఫ్.పి.ఓపై సభ్యులు యాజమాన్యము మరియు నియంత్రణ కలిగి ఉంటారు.


## సభ్యుల బాధ్యతలు

ఎఫ్.పి.ఓలో సభ్యులకు కేవలం హక్కులే కాదు కొన్ని బాధ్యతలు కూడా నెరవేర్చవలసి ఉంటుంది. ఎఫ్.పి.ఓలో సభ్యుల బాధ్యతలు దిగువ చూపడం జరిగినది.

## చిత్రం 2 : సభ్యుల బాధ్యతలు

| సేవల అంగీకారము మరియు ఉపయోగం | యాజమాన్యం మరియు నియంత్రణ | ఆర్థిక వనరులు సమకూర్చడం |
|---|---|---|
| **సంఘస్థాయిలో**<br>– సేవల వినియోగించుకొనుటకు అంగీకారము తెలియజేయుట.<br>– వాస్తవముగా సేవల వినియోగం | – ప్రధాన నిర్ణయములపై ఓటింగ్<br>– పాలకవర్గ సభ్యులను ప్రతిపాదించుట మరియు ఎన్నుకొనుట<br>– ప్రధాన నిర్ణయములలో పాల్గొనుట | – వాటాధనం చెల్లించుట<br>– పొదుపులు చేయుట<br>– వివిధ రూపములో మూలధనమును సమకూర్చడం |
| **సమాఖ్య స్థాయిలో**<br>– సమాఖ్య సేవలు, షరతులను తెలుసుకొని, సభ్యత్వమునకు అంగీకారము తెలియజేయుటకు<br>– సేవల వినియోగము<br>– సమాఖ్య సభ్యత్వము, ప్రయోజనములు సమీక్షించడము | – ప్రాతినిధ్య మహాసభకు ప్రతినిధుల ఎంపిక<br>– రైతుసంఘాల స్థాయిలో చర్చలలో పాల్గొని, నిర్ణయమును తెలియజేయటము | – రైతు సంఘం ద్వారా వాటాధనము, పొదుపులు ఇతర చెల్లింపులు సమయమునకు చెల్లించుట<br>– వార్షిక నివేదిక, ఆడిట్ నివేదికను పరిశీలించి, ఆమోదము తెలుపుట |







పైన వివరించిన విధముగా సభ్యులు ఎఫ్.పి.ఓ సేవలు తీసుకోవడానికి అంగీకరించటమే కాక, ఎఫ్.పి.ఓతో అంగీకరించిన విధముగా వాస్తవంగా సేవలను వినియోగించాలి. (ఉదాహరణకు మనము 10 క్వింటాళ్ళ పంటను వచ్చే పంట కాలములో ఎఫ్.పి.ఓకు ఇస్తామని అంగీకరిస్తే అంగీకరించిన 10 క్వింటాళ్ళను ఎఫ్.పి.ఓకు ఇవ్వటము అన్నమాట). అంతేకాక మనము సభ్యులుగా మహాసభ సమావేశములకు హాజరు అయి చర్చలలో చురుకుగా పాల్గొనాలి. (ఉదాహరణకు ఏ ఆడిటరును మన ఎఫ్.పి.ఓ. ఆడిట్ కొరకు నియమించాలి వంటి చర్చలు అన్నమాట). దీనితోపాటు మన ఎఫ్.పి.ఓలో మనము వివిధ రూపాలలో డబ్బు చెల్లించి మూలనిధి పెంచుకొనుటకు దోహదపడాలి.

## అభ్యాసము 1 : కమలాపూర్ రైతు ఉత్పత్తి దారుల సంస్థ

రమణ మరియు శ్యాం కమలాపూర్ ఎఫ్.పి.ఓ.లో సభ్యులుగా చేరారు. వివిధ సేవలు పొందటానికి వాటాధనం కూడా చెల్లించారు. రమణ కావలసినంత విత్తనం మరియు ఎరువులను ఎఫ్.పి.ఓ. నుంచి తీసుకొని 25 క్వింటాళ్ళ కూరగాయలు కూడా ఎఫ్.పి.ఓ.కు సరఫరా చేశారు. అతను ఎఫ్.పి.ఓ. నుంచి రుణ సదుపాయం మరియు భీమా సౌకర్యం కూడా పొందాడు.

శ్యాం 50 క్వింటాళ్ళ కూరగాయలు ఎఫ్.పి.ఓ.కు సరఫరా చేశారు. కానీ ఇతర సేవలు ఏమీ ఉపయోగించుకోలేదు. ఇద్దరు వార్షిక మహాసభ సమావేశమునకు హాజరై, ఓటింగ్ మరియు నిర్ణయములు చేయుటలో చురుకుగా పాల్గొన్నారు. వారు ఎఫ్.పి.ఓ. వార్షిక నివేదకను కూడా పొందారు. శాంత ఇదే ఎఫ్.పి.ఓ.లో సభ్యురాలు. ఆమె 25 క్వింటాళ్ళ కూరగాయలు సరఫరా చేసి, ఇతర సేవలు కూడా వినియోగించుకున్నది. కానీ ఆమె ఎప్పుడు మహాసభకు హాజరు కాలేదు. బాలయ్య అనే మరో రైతు వాటాధనం చెల్లించి సభ్యత్వం తీసుకున్నాడు. కాని ఎప్పుడు ఎటువంటి సేవలు ఉపయోగించుకోలేదు, మహాసభకు కూడా ఎప్పుడు హాజరు కాలేదు.

వార్షిక మహాసభ జరగడానికి ముందు ఎఫ్.పి.ఓ. మహాసభలో మరియు ఓటింగ్‌లో పాల్గొనడానికి అనర్హులైన సభ్యుల జాబితాను ప్రకటించింది. దానిలో బాలయ్య మరియు కొంతమంది పేర్లు ఉన్నాయి. అనర్హతకు కారణములు దిగువ పొందుపరచబడినవి.

1. సభ్యులు ఎఫ్.పి.ఓ సేవలు వినియోగించుకనలేదు.
2. సభ్యులు ఎఫ్.పి.ఓ కార్యక్రమములలో పాల్గొనలేదు.
3. సభ్యులు గత రెండు సంవత్సరముల మహాసభులకు హాజరు కాలేదు.

ఇటీవల వార్షిక మహాసభలో రమణ మరియు శ్యాం ఇతర సభ్యులతో కలిసి ఓటింగ్‌లో పాల్గొన్నారు మరియు లాభములో 40 శాతం సేవలు వినియోగించుకున్న సభ్యులకు వారు పొందిన సేవల నిష్పత్తిలో పంచాలని నిర్ణయం తీసుకున్నారు.

1. బాలయ్య మరియు కొంతమంది సభ్యులు వార్షిక మహాసభలో పాల్గొని ఓటు చేయడానికి ఎందుకు అనర్హులు?
2. ఎఫ్.పి.ఓ.లో నిర్ణయములు ఎవరు తీసుకుంటారు?
3. పైన పేర్కొన్న కేసు ప్రకారం సభ్యులు మరియు ఎఫ్.పి.ఓ. మధ్య సంబంధమును వివరించుము.
4. ఇప్పటికీ బాలయ్య లాభములో 40శాతం భాగం పొందటానికి అర్హుడా?

## అభ్యాసం 2

ఈ క్రింద ఎఫ్.పి.ఓ. సభ్యత్వమునకు సంబంధించిన కొన్ని సందర్భములు ఇవ్వబడినవి. వీటిలో మీ సభ్యత్వములో మన ఎఫ్.పి.ఓ. పని తీరును అంచనా వేద్దాము. దిగువ పేర్కొన్న స్కేల్‌లో మార్కులు ఇవ్వగలము.

చాలా తక్కువ (1) –తక్కువ (2) –సరిపోదు (3) –ఎక్కువ (4) – చాలా ఎక్కువ (5)

ఎక్కడైతే రేటింగ్ సరిపోదు మరియు అంతకన్నా తక్కువ వున్నచోట సభ్యత్వ పరిస్థితిని మెరుగుపరచడానికి తీసుకోవలసిన చర్యలను సూచించగలము.

1. ఒక ఎఫ్.పి.ఓ వ్యవహార పరిధిలో 80% సభ్యత్వ అర్హతలు కలిగినవారు సభ్యులుగా చేరినారు.

   మార్కులు : .....................

   తీసుకొనవలసిన చర్య: ...........................................................................

   ...........................................................................................................

2. శ్యామల రాంపూర్ డైరీ సహకార సంఘం సభ్యురాలు. ఆమె సంఘమునకు పాలు సరఫరా చేస్తున్నది. అంతేకాక ఆమె సంఘము నుండి పశుపాలక సేవలు ఉపయోగించుకొనుచున్నది. అయితే ఆమె ఎప్పుడూ మహాసభకు హాజరయి ఓటు చేయలేదు. శ్యామల సంఘ సభ్యురాలిగా కొనసాగవచ్చునా?

   మార్కులు : .....................

   తీసుకొనవలసిన చర్య: ...........................................................................

   ...........................................................................................................

3. బాలయ్య ఒక సహకార సంఘం సభ్యుడు. ఆ సంఘం జీడి సేకరించి మరియు ఉత్పత్తులను తయారు చేస్తుంది. ఐనప్పటికీ బాలయ్య ఎప్పుడూ సంఘానికి జీడి ఉత్పత్తి సరఫరా చేయలేదు. ఆయన సహకార సంఘములో సభ్యుడుగా కొనసాగవచ్చునా?

   మార్కులు : .....................

   తీసుకొనవలసిన చర్య: ......................................................................

   ......................................................................................................

apmas

4. జయ దేవి రంగాపూర్ డైరీ సహకార సంఘం సభ్యురాలు. ఆమె క్రమబద్ధముగా సంఘమునకు పాలు సరఫరా చేయుచున్నది. అనేక సేవలు ఉపయోగించుకుంటున్నది. మరియు మహాసభకు హాజరై, ఓటింగ్ మరియు నిర్ణయములు తీసుకొనుటలో పాల్గొనుచున్నది. ఆమె సంఘ సభ్యురాలిగా కొనసాగవచ్చునా?

మార్కులు : .....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................................................

..............................................................................................

5. ఎఫ్.పి.ఓ. డైరీలో మొత్తం 6000 సభ్యులలో, సగం (3000) మంది సభ్యులు సంవత్సరమునకు నిర్ణయించిన కనీస పరిమాణం 180 లీటర్ల పాలను ప్లాంట్‌కు సరఫరా చేయుచున్నారు.

మార్కులు : .....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................................................

..............................................................................................

6. ఒక ఎఫ్.పి.ఓ.లో సాధారణముగా కనీసం 80శాతం సభ్యులు క్రమబద్ధముగా మహాసభకు హాజరు అవుతారు.

మార్కులు : .....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................................................

..............................................................................................

7. మరొక ఎఫ్.పి.ఓ.లో సాధారణముగా 20 శాతం పాలకవర్గ సభ్యులు నిర్ణయములో చురుకుగా పాల్గొంటారు.

మార్కులు : .....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................................................

..............................................................................................

8. ఒక ఎఫ్.పి.ఓ. నుంచి 2 సంవత్సరముల కాలములో మూడింట ఒక వంతు (1/3) మంది సభ్యులు సభ్యత్వము నుండి విరమించుకున్నారు.

మార్కులు : ....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................

.................................................................................

9. ఒక ఎఫ్.పి.ఓ. సభ్యుల నుండి ఎరువుల డిమాండ్ అంచనా ఆధారముగా 100 బస్తాలను కొనుగోలు చేసినది, అయితే కేవలము 40 బస్తాలు మాత్రమే సభ్యులు తీసుకున్నారు.

మార్కులు : ....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................

.................................................................................

10. డైరీ కార్యక్రమములో ఉన్న ఒక ఎఫ్.పి.ఓ. డైరీని నిర్వహిస్తున్నది. గత వరుసగా 3 సీజన్ల నుండి పాల శీతలీకరణ కేంద్రము సామర్థ్యమునకు అవసరమైన పాలు సభ్యుల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ, 60 శాతం పాలను చాలా దూర ప్రాంతములోని సభ్యేతరుల నుండి సేకరించుచున్నది.

మార్కులు : ....................

తీసుకొనవలసిన చర్య: ..............................................................

.................................................................................

## అభ్యాసం 3

పైన చర్చించిన మార్గదర్శకముల ఆధారముగా మన ఎఫ్.పి.ఓ ఎంతమేర సభ్యుల యాజమాన్యము మరియు నియంత్రణలో నిర్వహించబడుతోందో అంచనా వేయగలము.

.................................................................................

.................................................................................

.................................................................................

.................................................................................

apmas

3

# సభ్యత్వములో ముఖ్య అంశములు

## ఉద్దేశ్యం



**పాలకవర్గ సభ్యులు ఎఫ్.పి.ఓలోని సభ్యత్వములో వివిధ అంశములపై అవగాహన పెంపొందించుకుంటారు.**

### విషయాంశాలు

1. సభ్యుల సమీకరణ
2. సభ్యుల అవసరములు, ప్రయోజనములు కొరకు పనిచేయుట
3. ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల స్థాయిలో స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రయోజనములను సమన్వయం చేయుట.
4. సభ్యులతో సత్సంబంధములను కొనసాగించుట

ఎఫ్.పి.ఓ.లో సభ్యుల, యాజమాన్య మరియు నియంత్రణ ప్రాముఖ్యతను తెలుసుకున్న తరువాత, ఇప్పుడు దిగువ పొందుపరచిన సభ్యత్వములోని ముఖ్య అంశములు గురించి తెలుసుకుందాము.


- సభ్యుల సమీకరణ
- సభ్యుల అవసరములు, ప్రయోజనముల కొరకు పనిచేయుట
- ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల స్థాయిలో స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రయోజనములను సమన్వయం చేయుట.
- సభ్యులతో సత్సంబంధములను కొనసాగించుట

ఇప్పుడు ఈ అంశములను ఒకదాని తరువాత ఒకటి పరిశీలిద్దాము.

## 3.1. సభ్యుల సమీకరణ

ఎఫ్.పి.ఓ. లాభదాయకత మరియు సుస్థిరత కొరకు, సభ్యులను చేర్చుకొని వారికి అవసరమైన సేవలను అందిస్తూ, వారు సభ్యులుగా వినియోగదారులుగా కొనసాగేలా చూడటం చాలా ముఖ్యం. మన ఎఫ్.పి.ఓ.లో సభ్యులకు సమర్ధవంతమైన సేవలు అందించటమే కాకుండా, సభ్యులు మన ఎఫ్.పి.ఓ. పరిపాలనలో మరియు నిర్వహణలో సమర్ధవంతముగా పాల్గొనేలా చూడాలి. ఎఫ్.పి.ఓ.లో సభ్యుల సమీకరణ మూడు స్థాయిలలో జరుగుతుంది. అది ఏ విధముగా జరుగుతుందో ఇప్పుడు పరిశీలించుదాము.

**చిత్రం 3 : సభ్యుల సమీకరణ**



- **సభ్యులను చేర్చుకొనుట:** ఎఫ్.పి.ఓ వ్యవహార పరిధిలో అర్హతగల రైతులందరి నుండి పూర్తి వాటా ధనం సేకరించి వారిని సభ్యులుగా చేర్చుకొనుట
- **చురుకైన సభ్యులు:** సభ్యత్వ కొనసాగింపుకు అవసరమైన కనీస నిబంధనలు సభ్యులు అందరూ అనుసరించుట
- **సభ్యుల పూర్తి భాగస్వామ్యం:** సభ్యత్వ కొనసాగింపుకు అవసరమైన కనీస నిబంధనలకు మించి సేవలను వినియోగించుకుంటూ, చురుకుగా సమావేశములో, ఓటింగ్‌లో మరియు నిర్ణయములలో చురుకుగా పాల్గొనుట

పైన తెలిపిన ప్రకారం ఎఫ్.పి.ఓ.లో నామమాత్రముగా సభ్యులను చేర్చితే సరిపోదు, వారు ఎఫ్.పి.ఓ. నిబంధనావళిలో పేర్కొన్న కనీస సేవల నిబంధనలను వినియోగించుకోవలెను. (ఉదాహరణకు డైరీ సహకార సంఘంలో ప్రతి సభ్యుడు సంవత్సరమునకు కనీసం 180 లీటర్ల పాలు సరఫరా చేయవలెనని కనీస సేవల నిబంధన) అంతేకాక ఎఫ్.పి.ఓ. సుస్థిరముగా పనిచేయాలంటే సభ్యులు చురుకుగా ఓటింగ్ మరియు నిర్ణయములు చేయుటలో పాల్గొనవలెను.

పైన పేర్కొన్న అన్ని స్థాయిలలో సభ్యులను సమీకరించుట పాలకవర్గ సభ్యుల ముఖ్య బాధ్యత. అయితే సభ్యులుగా వారు కొనసాగటానికి సమావేశములు, ఎన్నికలు, నిర్ణయములలో చురుకుగా పాల్గొనుటకు తగిన నిబంధనలను పాలకవర్గము రూపొందించాలి. అంతేకాక పాలకవర్గం, సిబ్బంది ద్వారా లేక ప్రోత్సాహక సంస్థల ద్వారా సభ్యులకు మూడు స్థాయిలలో సమయానుసారం అవగాహన కల్పించుటకు మరియు సేవలను అందించుటకు అవసరమైన చర్యలు తీసుకొనవలెను.

## పునఃశ్చరణ ప్రశ్నలు

1. మన ఎఫ్.పి.ఓ వ్యవహార పరిధిలో అర్హత గల రైతులు చాలామంది ఎఫ్.పి.ఓలో సభ్యులుగా చేరారా?
2. మన ఎఫ్.పి.ఓలోని మెజారిటీ సభ్యులు చురుకైన సభ్యులుగా వ్యవహరిస్తున్నారా ?
3. మన సభ్యులలో ఎంతమంది కనీస సేవల నిబంధనల కంటే ఎక్కువగా సేవలు వినియోగించు కుంటున్నారు మరియు చురుకుగా ఎఫ్.పి.ఓ కార్యక్రమములలో పాల్గొంటున్నారు ?

## 3.2. సభ్యుల అవసరములు, ప్రయోజనముల కొరకు పని చేయుట

ఏదైనా ఎఫ్.పి.ఓ అన్నివేళలా తమ సభ్యులకు పరిమిత స్థాయిలో మాత్రమే సేవలను అందించితే ఏమి అవుతుంది?

ఎఫ్.పి.ఓలో సభ్యులే వినియోగదారులు కాబట్టి ఇతర సంస్థలకన్నా ఎఫ్.పి.ఓ తన సభ్యులకు ఎక్కువ ప్రయోజనము చేకూర్చే సేవలను అందించాలి. ఉదాహరణకు ఎఫ్.పి.ఓ సభ్యుల నుంచి వేరుశనగ కొనుగోలు కార్యక్రమము చేపట్టి వుంటే, ఆ ప్రాంతములోని వేరే కొనుగోలుదారుని కన్నా ఎక్కువ పరిమాణములో వేరుశనగను సేకరించాలి. అంటే ఎఫ్.పి.ఓ కనీసం సభ్యుల అవసరాలలో కనీసం సగం అవసరాలను నాణ్యమైన పద్ధతిలో, నిరంతరము తీర్చగలిగి ఉండాలి. అనగా ఆ ప్రాంతంలో సేవలు అందించే ఇతర సంస్థల కన్నా అధికముగా ఎఫ్.పి.ఓ సేవలు అందించాలి. అప్పుడే ఆ ఎఫ్.పి.ఓ సభ్యుల ప్రయోజనము కొరకు పని చేస్తుందని చెప్పగలం.

పై చర్చల వలన ఎఫ్.పి.ఓకు తన సభ్యుల అవసరములకు తగ్గట్లుగా సేవలు అందించడం ఎంత ముఖ్యము అన్నది తెలిసినది. సభ్యుల అవసరముల ఆధారముగా, సభ్యుల ప్రయోజనము కొరకు ఎఫ్.పి.ఓ సేవలు అందించినప్పుడే ఎఫ్.పి.ఓ తమది అనే భావన సభ్యులలో కలుగుతుంది.

సభ్యుల ప్రయోజనము కొరకు పని చేసే ఎఫ్.పి.ఓ. గా వుండటము అంటే ఏమిటో మనము ఇప్పుడు చూద్దాం.

## సభ్యుల ప్రయోజనము

అనంత ఎఫ్.పి.ఓలో సభ్యులందరికీ వేరుశెనగ ప్రధాన పంట ఈ ఎఫ్.పి.ఓలో వ్యక్తిగత సభ్యుల సగటు వివరములు క్రింద తెలుపబడినవి.

పెట్టుబడి అవసరాల వ్యయం – రూ. 12,000 (విత్తనం, ఎరువు, పురుగుమందులుతో సహా) ఎకరానికి.

దిగుబడి విలువ రూ. 24,000 (6 క్వింటాల్ ఎకరానికి @ ధర రూ. 4,000 క్వింటాకు).

కాబట్టి ఒక్క సభ్యులు పొందవలసిన మొత్తం సేవల విలువ రూ. 36,000 ఎకరానికి

మొత్తం ఉత్పత్తి అవసరములలో రూ. 8,000 (ఎరువులు మరియు విత్తనములు) ఎఫ్.పి.ఓ నుండి పొందినవి.

దిగుబడిలో 4 క్వింటాల్ ఎఫ్.పి.ఓ కు విక్రయించడం జరిగినది. రూ. 16,000.

ఎఫ్.పి.ఓ నుంచి పొందిన మొత్తం సేవల విలువ రూ. 24,000 (రూ. 8,000 + రూ. 16,000)

అందువల్ల సభ్యులు మూడింట రెండు (2/3) వంతు అనగా (రూ. 24,000 లు 36,000లలో) అవసరమైన సేవలు ఎఫ్.పి.ఓ నుండి పొందుతున్నారు అంటే ఎఫ్.పి.ఓ సభ్యులకు అవసరమైన, ప్రయోజనము పొందే సేవలను అందిస్తున్న ముఖ్యమైన సంస్థ అని అర్థము.



## అభ్యాసం 1

ఎఫ్.పి.ఓ సభ్యుల ప్రయోజనము గురించి అని తెలిపే కొన్ని సందర్భములు దిగువ ఇవ్వబడినవి. పైన జరిగిన చర్చ ఆధారముగా ఈ సందర్భములో సభ్యుల ప్రయోజనము వున్నది లేనిది (అవును, కాదు) సమాధానం చెప్పండి. సమాధానములకు వివరణ కూడా ఇవ్వండి.

1. ఒక రైతు తన 2.5 ఎకరముల భూమిలో 2 ఎకరములలో పత్తి పండిస్తాడు. పత్తి అతని కుటుంబానికి ప్రధాన ఆదాయం అందించే పంట. ఈ ప్రాంతములో పత్తి పెట్టుబడి అవసరముల సరఫరా, పరపతి, సేకరణ, విలువ పెంచుట మరియు మార్కెటింగ్ సేవలు అందించుటకు ఒక ఎఫ్.పి.ఓ ఏర్పాటు కాబోతున్నది. ఆ రైతు సభ్యులుగా ఈ ఎఫ్.పి.ఓలో చేరడానికి ఆసక్తితో వుంటారా?

   సమాధానం: .......................

   వివరణ: ..........................................................................................

   ..........................................................................................

2. పైన తెలిపిన సందర్భములో ఉదాహరణకు 5 సంవత్సరముల తరువాత సోయాబీన్ ప్రధాన ఆదాయ పంటగా మారితే ఎఫ్.పి.ఓ తన సేవలను సోయాబీన్‌కు అనుగుణముగా మార్చాలా?

   సమాధానం: .......................

   వివరణ: ..........................................................................................

   ..........................................................................................

3. ఇంకొక సందర్భములో ఒక ప్రాంతములో రైతులకు కందులు వారి ప్రధాన జీవనోపాధి. ఆ ప్రాంతములో పాడి పశువుల సంఖ్య చాలా తక్కువ అయినప్పటికీ ఎఫ్.పి.ఓ పాల సహకార సంఘమును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినది. ఈ ఎఫ్.పి.ఓ సభ్యుల ప్రయోజనము గురించి పనిచేస్తున్నదని చెప్పగలమా?

   సమాధానం: .......................

   వివరణ: ..........................................................................................

## అభ్యాసం 2

దిగువ పేర్కొన్న అంశములకు సంబంధించి మన ఎఫ్.పి.ఓ మన సభ్యులకు అందించే సేవలపై అంచనా వేయగలము.

| క్ర.సం. | వివరములు | ప్రస్తుత స్థితి |
|---|---|---|
| 1. | ఎంతమంది సభ్యులకు సేవలు అందించబడినవి | |
| 2. | సభ్యులకు కావలసిన సేవల విలువ | |
| 2 ఎ | ఎకరానికి పెట్టుబడి అవసరముల వ్యయం ఎంత | |
| 2 బి | ఎకరానికి దిగుబడి విలువ ఎంత | |
| 2 సి | మొత్తం సేవల విలువ | |
| 3. | మొత్తం సేవలలో ఎఫ్.పి.ఓ నుంచి పొందిన సేవలు | |
| 3 ఎ | ఎఫ్.పి.ఓ నుంచి పొందిన పెట్టుబడి ఎంత | |
| 3 బి | ఎఫ్.పి.ఓకు విక్రయించబడిన దిగుబడి విలువ | |
| 3 సి | ఎఫ్.పి.ఓ నుంచి పొందిన మొత్తం సేవల విలువ | |
| 4. | ఎఫ్.పి.ఓ నుంచి పొందే మొత్తం సేవల శాతం | |
| 5. | సభ్యులకు ప్రయోజనము (ఎక్కువ/ తక్కువా) | |

మన ఎఫ్.పి.ఓ ఇతర సంస్థలతో పోల్చితే, సభ్యులకు ఎక్కువ ప్రయోజనము అందించుతున్నదా? లేనట్లయితే మన ఎఫ్.పి.ఓ సభ్యులకు ఎక్కువ ప్రయోజనము అందించుటకు చేపట్టవలసిన చర్యలు ఏమిటి? క్రింద వ్రాయగలము.

## 3.3. సభ్యుల మరియు ఎఫ్.పి.ఓ స్థాయిలో ప్రయోజనముల సమన్వయము

ఈ సెక్షన్‌లో సభ్యుల మరియు ఎఫ్.పి.ఓ స్థాయిలో స్వల్ప మరియు దీర్ఘకాల ప్రయోజనముల సమన్వయము చేయవలసిన ప్రాముఖ్యతను గురించి చూద్దాము. ఎఫ్.పి.ఓ యొక్క ప్రధాన లక్ష్యం సభ్యులకు ప్రయోజనం కలిగంచుటే. అయితే ఎఫ్.పి.ఓ స్థాయిలో కూడా ప్రయోజనము పొందటము అవసరమే. ఎఫ్.పి.ఓలకు ప్రయోజనము లేకపోతే ఎఫ్.పి.ఓ ఎక్కువ కాలము నడవలేదు. సభ్యులకు సేవలు అందించలేదు. అందువల్ల సభ్యులకి కూడా ఎక్కువ కాలము ప్రయోజనము వుండదు. క్రింద ఇవ్వబడిన రెండు వేరు వేరు ఎఫ్.పి.ఓలలోని సందర్భములను పరిశీలించి విశ్లేషిద్దాము.

### సందర్భం ఎఫ్.పి.ఓ 1

ఈ ఎఫ్.పి.ఓ సభ్యుల వద్ద నుండి కూరగాయలను సేకరించి కార్పొరేట్ కొనుగోలుదారులకు విక్రయించినది. సభ్యులకు ఈ సేవ అందించడానికి ఎఫ్.పి.ఓకు పెట్టుబడి వ్యయం అయినది. (సేకరణ కేంద్రం, రవాణా వాహనం, సిబ్బంది, కూలీలు మొదలగునవి) అయినప్పటికీ ఈ ఎఫ్.పి.ఓ పాలకవర్గము, సభ్యులకు మార్కెట్ ధరకన్నా చాలా అధికముగా ధరను అందించినది. అందువల్ల ఎఫ్.పి.ఓ. కు నష్టం ఏర్పడినది. అంతేకాక అధిక వ్యాపార పెట్టుబడి మరియు నిర్వహణ ఖర్చులను సమకూర్చుకోలేకపోయినది.

### సందర్భం ఎఫ్.పి.ఓ. 2

ఈ ఎఫ్.పి.ఓ. కూడా అదే వ్యాపారం అదే వ్యయముతో చేయుచున్నది. అయితే ఈ ఎఫ్.పి.ఓ. మార్కెట్ ప్రకారం 3 రకముల నాణ్యతలను నిర్ణయించి సభ్యులకు పోటీ ధరను అందించినది. అంతేకాక సరైన తూకం. కమీషన్, రవాణా, వేచిన సమయం మొదలైన వ్యయాలను తగ్గించినది. దీనివలన సభ్యులు దీర్ఘకాలములో ప్రయోజనము పొందినారు మరియు ఎఫ్.పి.ఓ. కూడా తన వ్యాపార నిర్వహణ ఖర్చును భరించగలిగి, సభ్యులకు నిరంతరముగా సేవలను అందజేయగలుగుతున్నది.

దిగువ స్థలమును ఉపయోగించి రెండు సందర్భములలోని భావార్ధము ఏమిటో వ్రాద్దాము.

| సందర్భం ఎఫ్.పి.ఓ. 1 | సందర్భం ఎఫ్.పి.ఓ. 2 |
|---|---|
| | |

పై విశ్లేషణల వలన మనకు అర్ధము అయినది ఏమిటి అంటే ఏ కార్యక్రమములోనైనా సభ్యుల ప్రయోజనముతోపాటు, సంస్థ ప్రయోజనము కూడా ముఖ్యముగా పొందవలెను. ఎఫ్.పి.ఓ.లో ఎటువంటి కార్యక్రమము అయినా సభ్యులకు ప్రయోజనం కలిగించి, ఎఫ్.పి.ఓ. కి ప్రయోజనం లేకుండా లేదా ఎఫ్.పి.ఓకు ప్రయోజనము వుండి, సభ్యులకు లేకుండా ఉండరాదు. సభ్యుల మరియు ఎఫ్.పి.ఓ. స్థాయిలో ప్రయోజనములను సమన్వయము చేసే కీలకమైన బాధ్యత పాలకవర్గమునది. ఈ విషయముపై పాలకవర్గము అవసరమైన సభ్యుల అవగాహన కార్యక్రమములను చేపట్టవలెను.




ఇప్పుడు సభ్యులు ఆశించేవి మరియు ఎఫ్.పి.ఓ. లాభదాయకత మధ్య తలెత్తే వివాదములకు సంబంధించిన కొన్ని ఉదాహరణలను చూద్దాం.

| సేవ | సభ్యులు ఆశించేవి | ఎఫ్.పి.ఓ. లాభదాయకత |
|---|---|---|
| ఎరువుల సరఫరా | తక్కువ ధరకు తమ భూమి దగ్గరగా దొరకాలి | ఎరువుల వ్యాపారములో తక్కువ లాభం వుంటుంది |
| వ్యవసాయ యంత్ర సామాగ్రి | ఎక్కువ కాలమునకు కావాలి, యంత్రాలను, అత్యధికంగా వినియోగించాలి. | యంత్రముల తరుగుదల ఎక్కువ, అధిక నిర్వహణా ఖర్చులు |
| కూరగాయల సేకరణ | నాసిరకమైన కూరగాయలకు అధిక ధర, వెంటనే డబ్బు చెల్లించాలి | కూరగాయల నాణ్యత తొందరగా క్షీణిస్తుంది, మార్కెట్టులో ధరలు నిలకడ వుండదు |


పై ఉదాహరణల వలన మనకు తెలిసేది ఏమంటే కొన్ని సమయములలో సభ్యులు ఆశించే సేవలకు మరియు ఎఫ్.పి.ఓ. లాభదాయకతకు మధ్య వివాదములు ఏర్పడవచ్చును. ఆ ప్రాంతములో పని చేస్తున్న ఇతర సంస్థల కన్నా సభ్యులు ఎఫ్.పి.ఓ. నుండి అతి ఎక్కువగా ఆశించినచో అవి ఎఫ్.పి.ఓకు అధిక వ్యయంకు దారి తీస్తుంది. ఈ అధిక ఖర్చులను ఎఫ్.పి.ఓ. వ్యాపారము ద్వారా వచ్చే ఆదాయము నుండి భరించలేదు. అంతేకాక తన సేవలను సుస్థిరం చేసుకోలేదు. కనుక ఎల్లప్పుడు సభ్యుల ఆశించినది మరియు ఎఫ్.పి.ఓ. లాభదాయకతలను సమన్వయం చేయుట పాలకవర్గం కీలక బాధ్యత.

## 3.4. స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రయోజనములను సమన్వయం చేయుట

స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రయోజనములను సమన్వయం చేస్తూ సభ్యులను సమీకరించటము చాలా ముఖ్యమైనది. స్వల్పకాలిక ప్రయోజనాలతో కూడా పోటీదారులు సభ్యులను ఆకర్షించడానికి తాత్కాలిక ఆకర్షణలను ఆశగా చూపుతారు. కనుక సభ్యులుగా చేరడం వలన కలిగే దీర్ఘకాలిక ప్రయోజనముల గురించికూడా సభ్యులకు అవగాహన కలిగించాలి.

ఉదాహరణకు ఒక ఎఫ్.పి.ఓ తమ సభ్యుల నుండి టొమాటొ కొనుగోలు చేసి వివిధ కొనుగోలుదారులకు అమ్ముతుంది. తమ సభ్యులకు వెంటనే చాలా లబ్ధి కలుగజేయాలనే అత్యుత్సాహంతో ఆ ఎఫ్.పి.ఓ ఒక కిలో టొమాటొ రూ. 10 చొప్పున కొనుగోలు చేసింది. అయితే అదే నాణ్యత టొమాటొకు ఆ సమయములో మార్కెట్ విలువ రూ.5/- కిలో ఉన్నది. దీనివలన సభ్యులు కేవలం స్వల్పకాలిక ప్రయోజనాల కోసం ఆకర్షితులవుతారు. మరియు ఎఫ్.పి.ఓ రూ॥ 10/- కిలో కన్నా ఎక్కువ ధరకు అమ్మలేకపోతే, అది ఎఫ్.పి.ఓ నష్టాలకు దారితీస్తుంది. తద్వారా ఎఫ్.పి.ఓ మళ్లీ తమ సభ్యుల నుండి పంట కొనుగోలు చేయలేదు.



ఎఫ్.పి.ఓ. తమ సొంత సంస్థ ఐనప్పటికీ ఎఫ్.పి.ఓ. స్థాయిలో సాధ్యాసాధ్యాలు గురించి పాలకవర్గము తమ సభ్యులకు అవసరమైన అవగాహన కార్యక్రమములను చేపట్టాలి. లాభదాయకత వల్ల ఎఫ్.పి.ఓ.లో అధిక పెట్టుబడికి అవకాశం కలిగి తద్వారా అనేక నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ఎఫ్.పి.ఓ. సభ్యులకు దీర్ఘకాలములో అనేక ప్రయోజనములు అందించగలదు. లేనట్లయితే సభ్యులు కేవలం స్వల్పకాలిక ప్రయోజనములు పొందవచ్చును. కాని అది ఎఫ్.పి.ఓ. లాభదాయకతకు దోహదపడదు. అందువల్ల సభ్యులకు నిరంతరం సేవలు అందించడం సాధ్యంకాదు. అందువల్ల కేవలం స్వల్పకాలిక సేవల వలన సభ్యులకు పూర్తి ప్రయోజనం కలగదు.

## 3.5. సభ్యులతో సంబంధములు

సభ్యులే ఎఫ్.పి.ఓ. యజమానులు మరియు వినియోగదారులు మరియు ఎఫ్.పి.ఓ సభ్యులకు జవాబుదారీగా వుండాలి. అంతేకాక ఎఫ్.పి.ఓ. వ్యాపార లాభదాయకత మరియు సుస్థిరతకు వారితో సత్సంబంధం కలిగి వుండుటము ఎంతో అవసరం, సభ్యులతో సత్సంబంధములు నిలుపుకొనుటకు వివిధ మార్గములు దిగువ చూపబడినది.

### చిత్రం 4 : సభ్యులతో సత్సంబంధములు పెంపొందించే విధానములు

| | |
|---|---|
| **సమాచారం** | కరపత్రములు<br>వార్షిక నివేదిక<br>ఎఫ్.పి.ఓ మాస నివేదికలు సభ్య సంఘాలకు అందించటము, నోటీసు బోర్డుపై ప్రదర్శన |
| **సేవలపై అభిప్రాయాలు మరియు సమస్యల సేకరణ** | ఉప కమిటీల ఏర్పాటు<br>రైతు సంఘం స్థాయిలలో చర్చ<br>సమస్యల పరిష్కారం<br>కార్యాలయం వేళలో సమస్యలను సేకరించుట |
| **సౌకర్యములు** | ఎఫ్.పి.ఓ. కార్యాలయము<br>సభ్యులతో పని చేసే ప్రాంతములు.<br>ఉదా॥ కొనుగోలు కేంద్రములు,<br>పంట అవసరములు సరఫరా కేంద్రం |
| **సేవల అందుబాటు** | సకాలములో నాణ్యమైన సేవలు<br>ఉత్తమ సభ్యులకు పారితోషికము/ అవార్డులు |
| **అవసరాల గుర్తింపు** | సమయానుసారం అవసరములలో మార్పులు<br>రైతు సంఘముల ద్వారా అవసరములు గుర్తించటము |
| **సభ్యులకు విద్య** | శిక్షణలు<br>అధ్యయన పర్యటనలు<br>అవగాహనా సమావేశములు |

పైన తెలిపిన ప్రకారం ఎఫ్.పి.ఓ. తన సభ్యులతో వివిధ మార్గముల ద్వారా సంబంధములు కలిగి ఉండవచ్చును. ఈ విషయములో సభ్యుల విద్య కార్యక్రమమలు, సమాచారం అందించే విధానములు చాలా ప్రతిభావంతమైనవి. సేవలు, అవసరములు, నాణ్యత మొదలగు విషయములపై క్రమబద్ధముగా సభ్యుల అభిప్రాయ సేకరణ తీసుకొనవలెను. దానివలన సమయానుసారం సేవలను మెరుగుపరచవచ్చును. అంతేకాక సభ్యులకు మరుగుదొడ్లు, తాగునీరు, కూర్చోటానికి స్థలము మొదలగు సౌకర్యముల ఏర్పాటు చేయవలెను.

### సమస్యల పరిష్కార పద్ధతి

సభ్యులకు సంబంధించిన సమస్యలను ఒక క్రమ పద్ధతిలో సకాలములో పరిష్కరించడం చాలా అవసరం. ఎఫ్.పి.ఓ. సభ్యుల సమస్యలను పరిష్కరించడానికి ఉప కమిటీని నియమించవలెను. సమస్యల ప్రభావమును బట్టి (నిర్వహణా పరమైన, ఆర్థికపరమైన మొదలగునవి) ఒకటి లేదా ఎక్కువ కమిటీలను ఏర్పాటు చేయవలెను.

- ❖ కమిటీ పేరు మరియు సంప్రదించవలసిన వ్యక్తి పేరు నోటీసు బోర్డు మరియు కరపత్రంలో స్పష్టముగా తెలియజేయవలెను.
- ❖ పరిష్కరించే విధానం పరిష్కారమునకు పట్టే సమయం కూడా తెలుపవలెను.
- ❖ అన్ని సమస్యలను నోటి ద్వారా / వ్రాత పూర్వకముగా వ్యక్తి పేరు, సమస్య రకంలతో స్వీకరించవలెను.
- ❖ రాబోయే పాలకవర్గ సమావేశములో చర్చనీయాంశములలో తీసుకొని పరిష్కరించవలెను.
- ❖ పాలక వర్గ సభ్యులు సంబంధింత వ్యక్తులు వ్యక్తిగతముగా కలిసి అర్థం చేసుకొని సమస్యను వివరించవలెను.
- ❖ నిర్ణయమును మినిట్స్ బుక్‌లో రికార్డు చేయవలెను, వ్రాతపూర్వకముగా తెలుపవలెను.

4

# ఎఫ్.పి.ఓలో సభ్యత్వం - ఎవరు? ఎలా?

## ఉద్దేశ్యం



**పాలకవర్గ సభ్యులు ఎఫ్.పి.ఓ. లోని సభ్యత్వ అర్హతలను అర్థం చేసుకొంటారు.**

**ఎఫ్.పి.ఓ.లో సభ్యత్వం పొందే విధానమును అర్థం చేసుకొంటారు**

### విషయాంశాలు

1. సభ్యులను చేర్చుకొనుట
2. సభ్యుల తొలగింపు
3. సభ్యత్వ రద్దు

ఎఫ్.పి.ఓ నిబంధనావళి/ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని సభ్యత్వ అర్హతలు, అనర్హతలకు లోబడి రైతులను సభ్యులుగా చేర్చుకొను బాధ్యత ఎఫ్.పి.ఓకు ఉంటుంది.

### సభ్యత్వం పొందే విధానము

❖ ఎఫ్.పి.ఓలో సభ్యత్వం కోరే రైతు ఎఫ్.పి.ఓ. కార్యదర్శి/ సి.ఇ.ఓకు దరఖాస్తు అందజేయవలెను. కార్యదర్శి/ సి.ఇ.ఓ. ఆ ధరఖాస్తును పాలకవర్గసభ్యుల ముందు నిర్ణయం కొరకు ఉంచును.

❖ సభ్యత్వం చేర్చుకొనుటపై సభ్యత్వ ధరఖాస్తు చేసిన 30 రోజులలోగా పాలకవర్గం నిర్ణయం చేయవలెను.

❖ నిర్ణయమును కారణములతో ధరఖాస్తుదారుకు తెలియజేయవలెను.

- ధరఖాస్తుదారు రూ ........ సభ్యత్వ రుసుం మరియు రూ............... వాటాధనం మరియు సభ్యత్వ సమయములో ఏమైనా ఇతర రుసుము చెల్లించాలి.
- ఎఫ్.పి.ఓ. సభ్యులు చెల్లించిన మొత్తమునకు రశీదు మరియు వాటాధనమునకు బాండ్ ఇచ్చి, సభ్యత్వ పుస్తకములో ఎప్పటికప్పుడు వ్రాయాలి.

సభ్యత్వమునకు సంబందించి చట్టం, నిబంధనావళి వ్యాపారం మరియు నిర్వహణ నియమాలకు లోబడి పాలకవర్గమునదే తుది నిర్ణయము, అయితే ఎఫ్.పి.ఓలలో చిన్న, సన్నకారు మరియు మహిళా రైతులు ఎక్కువగా సభ్యులుగా చేరడం చాలా ముఖ్యమైన విషయము.

## సభ్యత్వ రద్దు

ఏఏ సందర్భములలో సభ్యత్వం రద్దు కాబడును?

- సభ్యత్వం విరమణ కోరినపుడు ఎఫ్.పి.ఓ. పాలకవర్గ ఆమోదం తరువాత రద్దగును.
- ఎఫ్.పి.ఓ. నిబంధనావళి/ వ్యాపార నియమములకు సంబంధించి అనర్హత పొందినపుడు
- ఒక సంవత్సర కాలం ఎఫ్.పి.ఓ.ల లావాదేవీలు కాని, ఎటువంటి సేవలు కాని వినియోగం చేసుకోనప్పుడు
- ఎఫ్.పి.ఓ. ప్రయోజనములకు వ్యతిరేకమైన చర్యలకు పాల్పడినప్పుడు సభ్యత్వం రద్దు ఐనప్పుడు ఎఫ్.పి.ఓ. నియమముల ప్రకారం సభ్యుని ఖాతాను పరిష్కరించబడును.

5

# మూలధనం సమకూర్చుట - సభ్యత్వమే యాజమాన్యం

## ఉద్దేశ్యం



**పాలకవర్గం ఎఫ్.పి.ఓలో వాటాధనం ఆవశ్యకతపై అవసరమైన అవగాహన పొందుతారు**

**ఎఫ్.పి.ఓలో అధిక వాటాను పెంపొందించవలసిన ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.**


## విషయాంశాలు

1. ఎఫ్.పి.ఓలో వాటాధనం
2. ఎఫ్.పి.ఓలో సభ్యుల అత్యధిక ఆర్థిక వాటా ప్రాముఖ్యత

### పరిచయం

ఇంతకుముందు సభ్యులు ఎఫ్.పి.ఓ. మూలధన సేకరణకు సహకరించడం ద్వారా యాజమాన్య హక్కును కాపాడుకొనే కీలక పద్ధతిని మనం చూసాము. ఏదైనా ఎఫ్.పి.ఓ. నిజముగా సభ్యుల సొంత సంస్థ అయి, సుస్థిరముగా వుండాలంటే సభ్యుల నుండి ఎక్కువగా మూలధనం అవసరమవుతుంది. ఇప్పుడు సభ్యుల ఈ అతి ముఖ్యమైన విధిని పరిశీలిద్దాము.

1. ఎఫ్.పి.ఓ. వ్యాపారం ప్రారంభించడానికి ఏఏ నిధులు అవసరం?
2. వాటాధనం అంటే ఏమిటి?



ఎఫ్.పి.ఓ. వ్యాపారమునకు మూలధనం అవసరం. దానిని 3 రకములుగా సమకూర్చుకోవచ్చు.

అ) సభ్యుల నుండి యజమానులుగా వాటాధనం సేకరించటం

ఆ) ఎఫ్.పి.ఓ. వ్యాపారము ద్వారా ఆర్జించబడిన లాభం

ఇ) బయట వారి నుండి ఋణం లేదా అను సంధానము ద్వారా

సభ్యుల వాటాధనం రెండు ముఖ్యమైన లక్ష్యములను కలిగి ఉంటుంది. సభ్యుల వాటాధనం ఎఫ్.పి.ఓకు అవసరమైన మూలధనమును సమకూరుస్తుంది మరియు సభ్యులే యాజమాన్యులు అనే భావనను కలుగజేస్తుంది.

సభ్యుల వాటాధనం ఎఫ్.పి.ఓలో వ్యక్తిగత సభ్యుల విధేయతను ప్రతిబింబిస్తుంది, అంతేకాక ఎఫ్.పి.ఓ.ల వ్యక్తిగత సభ్యుల ఆర్థిక వాటాను సూచిస్తుంది. వాటాధనం సభ్యులు ఎఫ్.పి.ఓ.నుండి విరమించుకున్నప్పుడు మాత్రమే ఉపసంహరించబడుతుంది.

## ఎందుకు ఎఫ్.పి.ఓ. సభ్యుల నుండి వాటాధనం వసూలు చేస్తుంది?

వాటాధనం యాజమాన్యం అనే నాణెంకు ఒకవైపు మరియు సభ్యుల ప్రయోజనములు మరొకవైపు సభ్యులు ఎఫ్.పి.ఓ.కు తగినంత స్థాయిలో వ్యాపారమునకు పెట్టుబడిని సమకూరుస్తారు. దీనికి ప్రతిఫలముగా ఎఫ్.పి.ఓ. యజమానులైన సభ్యులకు ప్రయోజనములను అందిస్తుంది. సభ్యులకు అత్యంత ముఖ్యమైనది ఎఫ్.పి.ఓ. స్థిరత్వం. సభ్యులు ఎఫ్.పి.ఓ. సేవలు ఉపయోగించుకోవడానికి ఎఫ్.పి.ఓ.లో పెట్టుబడి పెడతారు. ఫలితముగా సభ్యులు కూడా ప్రయోజనము పొందుతారు.

ఇప్పుడు మనము ఎఫ్.పి.ఓ.కు ఏ రకమైన నిధులు ఉత్తమమైనవో చర్చించుదాము

ఎక్కువమంది సభ్యుల నుండి చిన్న మొత్తాలలో పెట్టుబడులను సేకరించి, ఎఫ్.పి.ఓ. వ్యాపారమునకు సరిపడే మూలధనమును సమకూర్చే అవకాశము వుందని ఎఫ్.పి.ఓ.లు నిరూపించగలుగుతున్నాయి.

apmas

ఎఫ్.పి.ఓ తన పరపతితో పెద్ద మొత్తంలో మూలధనమును ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే వారి వ్యాపార పరిధిలో పనిచేసే ఎఫ్.పి.ఓ.లలో సభ్యుల వాటాధనము పరిమితముగా వుంటుంది. నిధుల పెరుగుదల కూడా నెమ్మదిగా జరుగుతుంది.

సభ్యుల పెట్టుబడి బ్యాంకులు మరియు ఇతర ఋణదాతలకు సభ్యుల యాజమాన్యమును తెలియజేస్తుంది. అయితే నిధులు ఏఏ రూపాలలో, ఎలా వస్తున్నాయన్నది ఎఫ్.పి.ఓ.కు చాలా ముఖ్యము. ఎందుకంటే నిధులు వచ్చే విధానము బట్టే వాటికి సంబంధించిన నియమాలు, షరతులు వుంటాయి.

## కేస్ స్టడీ

ధరణి ఎఫ్.పి.ఓ. కమలాపూర్ బ్లాక్‌లోని రైతులతో పని చేయుచున్నది. అది సహకార సంఘముల చట్టం క్రింద నమోదు అయినది. సేవలు వినియోగించుకోవడానికి ఇష్టపడి, నిబంధనావళి నిబంధనలను మరియు ఇతర నియమములను పాటించడానికి సిద్ధమైన రైతులు, ఎఫ్.పి.ఓ. నిర్దేశించిన వాటాధనం మరియు ప్రవేశ రుసుం చెల్లించి సభ్యులుగా చేరినారు. ఈ ఎఫ్.పి.ఓ. సభ్యుల నుంచి మరియు సభ్యేతరుల నుంచి ఉత్పత్తిని కొనుగోలు చేస్తున్నది. అయినప్పటికీ ఎఫ్.పి.ఓ. తన వ్యాపార నియమములను అనుసరించి మొత్తం సేకరణలో 20 శాతమునకు మించకుండా సభ్యేతరుల (సభ్యులు కానివారు) నుండి కొనుగోలు చేస్తున్నది.

సభ్యుల వాటాధనం పరిమితం మరియు పెరగటానికి సమయం పడుతుంది అని గ్రహించి ఎఫ్.పి.ఓ. బ్యాంకులు మరియు ఇతర అభివృద్ధి సంస్థల ఋణములు పొంది తన కార్యక్రమములను వేగవంతం చేసినది.

గడచిన 3 సంవత్సరముల నుండి ఎఫ్.పి.ఓ. వార్షిక మహాసభ మిగులులో 40 శాతమును ప్రతీ సభ్యులకు ఎఫ్.పి.ఓ.తో చేసిన వ్యవహారముల నిష్పత్తిలో పంచాలని నిర్ణయించినది. సభ్యులు “మా ఎఫ్.పి.ఓ. మాతో చేసిన వ్యాపార లావాదేవీలతో ఎక్కువ లాభములు పొందాలని చూడటము లేదు. అందువలన మిగులు నుండి మాకు, మేము చేసిన వ్యవహారముల లావాదేవీల నిష్పత్తిలో తిరిగి ఇస్తున్నది. అందుకే మా ఎఫ్.పి.ఓను మేము నమ్ముతున్నాము” అని అన్నారు. మేము సభ్యుల వ్యవహార లావాదేవీలు బోనస్‌పై ఎక్కువ దృష్టి పెడతాము, ఎందుకంటే అవి ఎఫ్.పి.ఓ. నిరంతరము లాభం సంపాదించాలనే వత్తిడిని కలిగిస్తాయి. అది మా ఎఫ్.పి.ఓకు ఆరోగ్యకరమైనదని పాలకవర్గ సభ్యులు అంటున్నారు.

దిగువ స్థలమును ఉపయోగించి సభ్యుల నుండి వాటాధనమును వసూలు చేసిన వచ్చే ప్రయోజనములను వ్రాయండి.

**సభ్యుల ఆర్థిక వాటా**

మనము ఇప్పుడు రెండు ఎఫ్.పి.ఓ.లను పరిశీలించి సభ్యుల వాటా, యాజమాన్యం మరియు ఎఫ్.పి.ఓ. సుస్థిరతల మధ్య గల సంబంధమును విశ్లేషణ చేద్దాము.

**ఎఫ్.పి.ఓ. 1** ఎఫ్.పి.ఓ. వ్యవహార పరిధిలోని అర్హతగల రైతులందరూ పూర్తి వాటా ధనమును చెల్లించి ఎఫ్.పి.ఓలో సభ్యులుగా చేరినారు. సభ్యులు ప్రతి నెలా క్రమబద్ధముగా ఎఫ్.పి.ఓ.లో పొదుపులు చేస్తున్నారు. పంట పెట్టుబడి అవసరములు మరియు సంబంధిత ఖర్చుల కొరకు ఎఫ్.పి.ఓ. సభ్యుల నుండి డిపాజిట్స్ సేకరించి సభ్యులకు తమ డిపాజిట్స్‌పై 10 రెట్లు అప్పు సదుపాయమును కల్పిస్తున్నది. పంట కొనుగోలు సమయములో ఎఫ్.పి.ఓ. 10 శాతం మొత్తమును సభ్యులకు చెల్లించే మొత్తము నుండి మినహాయించి, వ్యాపార సీజన్ ముగిసిన తరువాత వారికి చెల్లించుచున్నది.

**ఎఫ్.పి.ఓ. 2** ఈ ఎఫ్.పి.ఓ.లో కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే సభ్యులు మరియు వారు కూడా వాటాధనములో కొంతభాగం మాత్రమే చెల్లించినారు. ఎఫ్.పి.ఓ. సభ్యులకు ఎటువంటి పొదుపులు మరియు అప్పు సదుపాయమును కలిగించటలేదు. ఎఫ్.పి.ఓ. ఆర్థిక సంస్థల నుండి మార్కెట్ వడ్డీ రేటుపై రుణములను పొందుతున్నది. అయినప్పటికీ ఆ మొత్తం ఎఫ్.పి.ఓ. వ్యాపారమునకు సరిపోవడం లేదు. అందువల్ల ప్రోత్సాహక సంస్థ ఎఫ్.పి.ఓకు వడ్డీలేని ఋణమును అందజేసినది. ఎఫ్.పి.ఓ. స్థాయిలో నిధుల సక్రమ నిర్వహణకు, మార్కెట్ నుండి సి.ఇ.ఓగా ఒక వ్యక్తిని నియమించమని ఆర్థిక సంస్థ ఎఫ్.పి.ఓకు సలహా ఇచ్చింది. అయితే ప్రోత్సాహక సంస్థ ఎఫ్.పి.ఓ. సిబ్బంది జీతములను తామే చెల్లించుచున్నది.


రెండు ఎఫ్.పి.ఓ. స్థితిని, సభ్యుల ఆర్థిక వాటా మరియు సభ్యుల యాజమాన్యం, నియంత్రణ మరియు సంస్థ సుస్థిరత అంశములను దృష్టిలో పెట్టుకొని విశ్లేషించి దిగువ ఇవ్వబడిన స్థలములో మీ అభిప్రాయమును రాయండి.

| ఎఫ్.పి.ఓ. 1 | ఎఫ్.పి.ఓ. 2 |
|---|---|
| | |

పైన పేర్కొన్న రెండు సందర్భముల ప్రకారం ఎఫ్.పి.ఓ.యాజమాన్యం మరియు సుస్థిరతకు సభ్యుల ఆర్థిక వాటా ఎంతో కీలకమని తెలుస్తున్నది. ఏ ఎఫ్.పి.ఓకైనా సొంతంగా కనీస మూలధనం లేకుండా బయట నుంచి మూలధనమును ఆకర్షించుట అసాధ్యం. అంతేకాక ఎక్కువ సొంత మూలధనం లేకుండా సభ్యుల యాజమాన్యం సాధ్యంకాదు. ఎక్కడ అయితే సొంత నిధులు తక్కువ వుంటాయో అలాంటి ఎఫ్.పి.ఓలను చాలామటుకు బయటి సంస్థలు నియంత్రిస్తూ ఉంటాయి.

సభ్యుల స్వంత నిధులు ఎక్కువగా ఉన్నచో, అవసరమైన యాజమాన్యం మరియు సభ్యుల చురుకైన భాగస్వామ్యం వుంటుంది.

దిగువ పేర్కొన్న మార్గముల ద్వారా సభ్యులు ఎఫ్.పి.ఓలో ఆర్థిక వాటా/ సొంత నిధులను కలిగి ఉండవచ్చును.



## అనుబంధం 1

## పరస్పర సహాయక సహకార సంఘముల (మ్యాక్స్) చట్టం 1995 ప్రకారం సభ్యత్వ నిబంధనలు

"సభ్యులు" అనగా ఎఫ్.పి.ఓ. నిబంధనావళిలోని సభ్యత్వ అర్హతా నియమములను పూర్తి చేసి వాటాధనం చెల్లించిన వ్యక్తిగత ఉత్పత్తిదారుడు లేక ఉత్పత్తిదారుల సంస్థ.

1. నిబంధనావళికి లోబడి ఏ వ్యక్తి అయినా సహకార సంఘం సేవలను వినియోగించుకోవడానికి ఇష్టపడి, సభ్యత్వ బాధ్యతలను వహించడానికి అంగీకరించిన మరియు ఇతర షరతులను పూర్తి చేసినచో అప్పుడు ఆ వ్యక్తిని సభ్యులుగా చేర్చుకొనవచ్చును. అయితే సంఘం తన సేవలను అందించే స్థితిలో వుండగలిగి, ధరఖాస్తుదారు ఇదే చట్టం క్రింద నమోదై ఇటువంటి సేవలు అందించే సంఘములో ఇదివరకే సభ్యులు కాకుండా ఉండవలెను.
2. సభ్యులను చేర్చుకొనుట మరియు తొలగించుట నిబంధనావళిలో పేర్కొనబడిన విధానము ప్రకారం మాత్రమే చేయవలెను. అదికూడా ఎన్నికైన పాలకవర్గం లేదా ఎక్కడైతే ఎన్నికైన పాలకవర్గం లేదో అక్కడ మహాసభ నిర్ణయము చేయవలెను.
3. సభ్యులుగా చేర్చుకొనబడిన వ్యక్తి సమయానుసారం నిబంధనావళిలో తెలుపబడిన షరతులను పూర్తిచేసిన తరువాత మాత్రమే ఓటింగుహక్కుతో సహా సభ్యత్వ హక్కులను వినియోగించు కొనవచ్చును. అయినప్పటికీ ఆ సభ్యులు ఒక సంవత్సర కాలము నుంచి సభ్యులుగా కొనసాగిన తరువాత మాత్రమే ఓటు హక్కును వినియోగించుకొనవచ్చును.

   అయితే పై నిబంధన సహకార సంఘ వ్యవస్థాపక సభ్యులకు, సంఘం స్థాపించిన మొదటి సంవత్సరములో వర్తించదు.
4. చట్టం ఏ వ్యక్తి ఒకే తరహా సేవలు అందించే ఒకటికి మించిన సహకార సంఘములలో సభ్యులు ఉండటము అనుమతించదు.

## అనుబంధం 2

## కంపెనీల చట్టం 2013 ప్రకారం సభ్యత్వ నిబంధనలు

### సభ్యుల హక్కులు

సభ్యత్వము పొందిన నాటినుండి ఈ చట్టము ప్రకారము సభ్యత్వము కోల్పోయేవరకు ఒక సభ్యుడు/ సభ్యురాలు తమ హక్కులను వినియోగించుకోవచ్చు.

- ❖ తన వాటాలను బదిలీ చేసుకొనుటకు
- ❖ కంపెనీ సమావేశంలో తీర్మానములపై ఓటు చేయుటకు
- ❖ కంపెనీ అసాధారణ మహాసభ సమావేశమును కోరుటకు లేదా ఉమ్మడిగా కోరుటకు
- ❖ మహాసభ సమావేశం నోటీసు పొందుటకు
- ❖ మహాసభ సమావేశమునకు హాజరు అగుటకు మాట్లాడుటకు
- ❖ సమావేశంలో ప్రతిపాదించిన సవరణలపై తీర్మానములు ప్రవేశపెట్టుటకు
- ❖ కంపెనీలో రిజిస్టరు కాబడిన సంస్థ సభ్యులు అయినచో తన తరపున ప్రతినిధిని హాజరు ప్రతిపాదించుటకు ఓటు చేయడానికి నియమించుటకు
- ❖ కంపెనీ తన తీర్మానములను పంపించుటకు
- ❖ కంపెనీ లాభములను డివిడెండ్ రూపములో అనుభవించుటకు
- ❖ డైరక్టర్స్‌ను ఎన్నుకొనుట, వారిద్వారా కంపెనీ నిర్వహణలో పాల్గొనడానికి
- ❖ అణచివేతకు గురైన సందర్భములో ఉపశమనం కొరకు కంపెనీ చట్టం బోర్డుకు ధరఖాస్తు చేసుకొనవచ్చును.
- ❖ నిర్వహణలో దుర్వినియోగం జరిగిన సందర్భములో ఉపశమనం కొరకు కంపెనీ చట్టం బోర్డుకు ధరఖాస్తు చేయవచ్చును. కంపెనీ మూసివేత కొరకు కోర్టుకు ధరఖాస్తు చేయవచ్చును.
- ❖ మూసివేత సమయములో మిగులులో వాటా పొందుటకు మరియు తనవాటా విషయములో షేర్ సర్టిఫికేట్ జారీ చేయమని కోరవచ్చును.

## సభ్యుని ఓటింగ్ హక్కు

ఎ) వ్యక్తిగత సభ్యత్వం గల సభ్యులైతే అతనికి/ ఆమెకు కంపెనీలో వున్న వాటాలు లేదా వాడుకున్న సేవలతో సంబంధం లేకుండా ప్రతి సభ్యులకి ఒక ఓటు ఉందును.

బి) వారు వాడుకున్న సేవల ఆధారముగా ప్రతి సంవత్సరం చివర ఏ సభ్యుడికి అదనపు ఓట్లు కేటాయించబడవు.

సి) ఒకవేళ కంపెనీలో ఉత్పత్తిదారుల సంస్థలు మాత్రమే సభ్యులు అయినచో ఆ సభ్యత్వ సంస్థలు గత సంవత్సరంలో చేసిన వ్యాపార లావాదేవీల ఆధారముగా ఓటు హక్కులు పొందటము జరుగుతుంది. అయితే కంపెనీ రిజిస్ట్రేషన్ అయిన మొదటి సంవత్సరంలో ఓటుహక్కు సభ్య సంస్థల వాటాల ప్రాతిపదికపై ఓటు హక్కు ఉందును.

డి) ఒకవేళ కంపెనీలో వ్యక్తిగత సభ్యులు మరియు ఉత్పత్తిదారుల సంస్థలు సభ్యులు అయినచో ప్రతి సభ్యునికి ఒక ఓటు హక్కును కలిగి వుంటారు.

ఇ) ప్రతీ చురుకైన సభ్యులకు కనీసం ఒక ఓటు ఉందును. అయితే కొత్తగా చేరిన సభ్యులకు 6 నెలల వరకు లేదా పాలకవర్గము నిర్ణయించిన కాలం ప్రకారం ఓటుహక్కు వుండదు.

## సభ్యత్వము రద్దు

దిగువ పేర్కొన్న సందర్భములలో సభ్యత్వము రద్దగును

- ❖ అతను/ ఆమె తన వాటాలను బదిలీ చేసినప్పుడు వాటా బదిలీ చేసిన సందర్భములో వాటాలు బదిలీ చేయబడే సభ్యుని పేర రిజిస్టర్ అయ్యే వరకు బదిలీ చేసిన వ్యక్తే కంపెనీలో సభ్యునిగా కొనసాగుతాడు.
- ❖ అతను/ ఆమె వాటాలు వదులుకొనినప్పుడు
- ❖ అధికారికముగా అప్పగించినప్పుడు
- ❖ చనిపోయినచో, వాటాలు బదిలీ అయ్యేవరకు ఆ వాటాలపై వున్న డబ్బు మొత్తము వరకు మాత్రమే.

- కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం తనకు గల హక్కు ద్వారా వాటాలను విక్రయించినచో
- కోర్టు లేదా తగిన అధికారము ఉన్న సంస్థలు ఆదేశాలు/ దావాలు మేరకు వాటాలను జప్తు చేయడం గాని అమ్మడం గాని చేసినప్పుడు.
- దివాళా తీసిన సందర్భములో న్యాయనిర్ణయము ప్రకారము అధికారిక వ్యక్తి తన వాటాలను పొందవచ్చు
- తప్పులు లేదా అవనీతికి పాల్పడటము వలన సభ్యత్వం కోల్పోయినప్పుడు.

**ప్రయోజనముల మధ్య వివాదం**

- ఉత్పత్తిదారుల కంపెనీ వ్యాపార ప్రయోజనముతో ఏ వ్యక్తికి వ్యాపారము విరుద్దముగా ఉన్నచో ఆ వ్యక్తి కంపెనీ సభ్యులు కావటానికి వీలు లేదు.
- ఏ వ్యక్తికి అయినా, కంపెనీ వ్యాపార ప్రయోజనమునకు విరుద్దముగా వ్యాపారమును చేస్తున్నట్లయితే ఆ వ్యక్తి సభ్యులుగా కొనసాగడానికి అనర్హులగును. కంపెనీ ఆర్టికల్స్ ప్రకారం అతనిని సభ్యత్వం నుంచి తొలగించబడును.

# ముగింపు పరీక్ష

ఈ పుస్తకము ప్రారంభములో మనం పూర్వపరీక్ష లోని ప్రాథమిక ప్రశ్నలకు మనము సమాధానం ఇచ్చినాము.

ఇప్పుడు ఈ పుస్తకము చివర ఈ పుస్తకము ద్వారా అదనముగా మనం పొందిన అవగాహనను అంచనా వేసుకోవడానికి కొన్ని ప్రశ్నలు ఇవ్వబడినవి.

కనుక ఈ పుస్తకములో మనం నేర్చుకున్న దాని ఆధారముగా క్రింది ప్రశ్నలకు సమాధానం ఇద్దాము.

1. ఎఫ్.పి.ఓ. లో చురుకైన సభ్యులు అని ఎవరిని అంటారు.

   ..............................................................................................

   ..............................................................................................

2. ఎఫ్.పి.ఓ. సేవలను ఉపయోగించుకొనడం సభ్యుల ముఖ్యమైన విధి ఎందుకు అవుతుంది?

   ..............................................................................................

   ..............................................................................................

3. సభ్యుల సమీకరణలో వున్న వివిధ స్థాయిలు ఏమిటి?

   ..............................................................................................

   ..............................................................................................

4. ఎఫ్.పి.ఓలో సభ్యుల అవసరములను, ప్రయోజనముల ఏ విధముగా నెరవేర్చవచ్చును?

   ..............................................................................................

   ..............................................................................................

5. ఎఫ్.పి.ఓ. మరియు సభ్యుల స్థాయిలో ప్రయోజనములను ఏ విధముగా సమన్వయం చేయగలము?

   ..............................................................................................

   ..............................................................................................

# ఈ పుస్తకము నుంచి చేపట్టవలసిన చర్యలు

## వినిమయ - రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో సభ్యత్వం

ఈ పుస్తకము నుంచి మీరు నేర్చుకున్న విషయాలతో మీ ఎఫ్.పి.ఓలో చేపట్టదలచిన చర్యలు ఏమిటి?

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................


..........................................................................................

..........................................................................................

apmas


# నోట్సు

# నోట్సు


ఎఫ్. పి. ఓ
ఎఫ్.పి.ఓ సేవలు
ఎఫ్. పి. ఓ

# ఏపిమాస్

ఏపిమాస్ జాతీయ స్థాయిలో పటిష్టమైన సహకార విలువలు, సహకార సూత్రాలు, స్వయం సహాయం, స్వయం ప్రతిపత్తి, పరస్పర ప్రయోజనమే లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మరియు ఇతర స్వయం సహాయక సంస్థలను బలోపేతం చేస్తూ, పూర్తిగా సభ్యుల ఆధీనంలో, సభ్యుల యాజమాన్యంతో, సభ్యుల నియంత్రణలో పనిచేసే రీతిలో వాటిని తీర్చిదిద్దడం పైన పనిచేస్తూ, వాటి సాధికారతకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ.







## వినిమయ - రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం

**ఏపిమాస్ ఏర్పాటుచేసిన ఎఫ్.పి.ఓ. ఇంక్యుబేషన్ సెంటర్** రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పి.ఓ.) ల ఏర్పాటుతో పాటు, వాటిని సమర్థవంతమైన, సుస్థిరమైన రీతిలో వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడం కోసం అవసరమైన సేవలన్నింటిని ఒకేచోట అందించే కేంద్రం. వివిధ ఎఫ్.పి.ఓ.లు, వాటిని ప్రోత్సహించే సంస్థల భాగస్వామ్యంతో ఈ సేవలు అందిస్తుంది. ప్రణాళికల రూపకల్పన, చట్టబద్ధ నియమాలను పాటించుట, సంస్థాగత నిర్వహణ, పరిపాలన, యాజమాన్యం, సంస్థల సామర్థ్యముల పెంపుదల మొదలగు సంస్థాగత సేవలు అందిస్తుంది. అదేక్రమంలో, ఎఫ్.పి.ఓ.ల వ్యాపారవకాశాల వృద్ధికి కావాలసిన ఆర్థికపరమైన అనుసంధానములు, మార్కెటింగ్ మద్దతు మరియు సాంకేతిక సాయం వంటి సేవలను కూడా అందిస్తుంది.

సహకరించినవారు
DGRV

ప్రచురణకర్త
apmas